ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
శుక్రవారం 22 మార్చి 2024





నరసరావుపేట మండలం ములకలూరులో ఏడాదిగా పునాదుల దశలోనే తరగతి గది నిర్మాణం

అందుబాట్లో లేని.. ఆర్వోలు



- నియోజకవర్గాలకు చుట్టపుచూపుగా రాక
- కోడ్ అమల్లోకి వచ్చినా ఇంకా పాత ధోరణే
- జిల్లా కేంద్రాల్లోనే ఎక్కువ సమయం విధులు
- పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు
- ఏఈఆర్వోలపై అధికార పార్టీ నేతల కర్ర పెత్తనం
- సకాలంలో నిర్ణయాలు తీసుకోలేకపోతున్న అధికారులు

గుంటూరు, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి): ఆర్వో.. రిటర్నింగ్ ఆఫీసర్. ఎన్నికల్లో వీరిదే కీలకపాత్ర. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికలకు సంబంధించి అన్నీ వీరే చూడాలి. కోడ్ అమలు నుంచి అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత.. ఎన్నికల సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే. ఇంతటి కీలక బాధ్యతల్లో ఉన్న కొందరు ఆర్వోలు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు చుట్టపు చూపుగా వెళ్లి వస్తున్నారన్న విమర్శలున్నాయి. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనే నివాసం ఉంటూ కోడ్ అమలుని పర్యవేక్షిస్తూ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన వారు ఎక్కువ సమయం జిల్లా కేంద్రాల్లోనే ఉంటున్నారు. చివరకు ఎన్నికల సంఘం రాష్ట్ర ఉన్నతాధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకు కూడా కలెక్టరేట్ల నుంచే కొందరు హాజరౌతున్నారు. దీంతో కోడ్ అమలు చేసే భారం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లపై పడుతోంది.

వీరిపై స్థానికంగా ఉండే నాయకులు పెత్తనం ఎక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో వారు సరైన నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారు. ఇదే అవకాశంగా పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు చెలరేగిపో తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా విభజన జరిగి దాదాపుగా రెండేళ్ల పూర్తి కావొస్తున్నా చాలామంది గుంటూరులోనే నివాసం ఉంటూ ఇక్కడి నుంచి వారి పని ప్రదేశాలకు వెళ్లి వస్తున్నారు. సాధారణ రోజుల్లో అంటే పెద్దగా పరిపాలనపై ప్రభావం ఉండదు. అయితే కోడ్ అమల్లోకి వచ్చిన సమయంలోనే పలువురు అదే వైఖరిని అవలంబిస్తున్నారు. ప్రత్తిపాడు, పొన్నూరు, మంగళగిరి, తాడికొండ ఆర్వోలు ఇక్కడే ఎక్కువ సమయం ఉంటున్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని నియోజకవర్గాల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్వోలలో కూడా కొందరు గుంటూరులోనే ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో కోడ్ సరిగా అమలు కావడం లేదని సమాచారం. షెడ్యూల్ విడుదల అయిన తరువాత జిల్లా అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లోనే సీఈవో ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. ఆర్వోలు ఆఫీసుల్లో కూర్చోవడం కాదు... క్షేత్రస్థాయికి వెళ్లాలి.. కోడ్ అమలుపై చర్యలు తీసుకోవాలని గట్టిగా హెచ్చరించారు. ఈ పరిస్థితికి కారణం పలువురు జిల్లా కేంద్రాలను దాటకపోవమేనని పలువురు చర్చించుకుంటున్నారు.

2019లో ఇలానే చేయగా...

2019 ఎన్నికల సమయంలోనూ కొంతమంది ఆర్వోలు ఇలానే చేయగా అప్పటి కలెక్టర్ కోన శశిధర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఆర్వో అయినా నియోజకవర్గం కేంద్రంలోనే ఉండాలని, వీడియో కాన్ఫరెన్స్‌లకు కూడా అక్కడి నుంచే హాజరు కావాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాంతో అప్పట్లో నరసరావుపేట లోక్‌సభ రిటర్నింగ్ అధికారి కార్యాలయం గుంటూరు కలెక్టరేట్ నుంచి నరసరావుపేట ఆర్డీవో కార్యాలయానికి మార్చారు. అప్పటి జేసీ హిమాన్షు శుక్లా నిత్యం అక్కడికే వెళ్లి సమావేశాలకు హాజరయ్యేవారు. ఇప్పుడు కూడా అధికారులు అలాంటి చర్యలు తీసుకోకపోతే సీఈవో ఆగ్రహానికి గురికాక తప్పదు.

నాడు నేడు.. పనులు నత్తేనయం అన్నట్లుగా సాగుతున్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిధులు రాక ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల తరగతి గదులు నిర్మాణ సామగ్రితో నిండిపోగా, విద్యార్థులకు తరగతులను ఆరుబయట చెట్ల కింద నిర్వహిస్తున్నారు. రెండో విడతలో చేపట్టిన పనులు ముందుకు సాగడంలేదు. పనుల పూర్తిపై నిర్లక్ష్యం తాండవిస్తోంది. అధికారులు సమీక్షలతో సరిపుచ్చుతున్నారు. విద్యాసంవత్సరం ముగియనున్నా పాఠశాలల్లో నాడు నేడు పనులు ఒక కొలిక్కి రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మొత్తం మీద నాడు నేడు పనులపై పాలకుల చిత్తశుద్ధి లోపంతో పురోగతి అంతంతమాత్రంగానే ఉంది.

నాడు నేడుకు.. నిధుల గండం



నరసరావుపేట మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడాదిగా నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

- పనులు నత్తనడకతో పోటీ
- విద్యా సంవత్సరం ముగుస్తున్నా పూర్తికాని పనులు
- వసతులు లేక విద్యార్థుల ఇక్కట్లు
- గదులు చాలక ఆరుబయట తరగతులు
- మూడు జిల్లాల్లో 3138 పాఠశాలల్లో పనులు
- నిధులు మంజూరు రూ.699.28 కోట్లు
- విడుదల రూ.348.06 కోట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అమలు చేస్తున్న నాడు నేడు పథకం రెండో విడతలో చేపట్టిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. నిధులు కొరత వెంటాడుతోంది. పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులకు నిధులు విడుదల కావడంలేదని పాఠశాలల పేరెంట్స్ కమిటీలు చెబుతున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండో విడతలో 3,138 పాఠశాలల్లో పనులు చేపట్టారు. ఇందుకు రూ.699.28 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వం అర్భాటంగా ప్రకటించింది. కానీ 348.06 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. నిధులు సకాలంలో విడుదల కాకపోతుండటంతో పేరెంట్స్ కమిటీలు పనులను నిలిపివేశాయి. స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించక పోవడంతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

మున్సిపాల్టీల పరిధిలోని పాఠశాలల్లో పబ్లిక్ హెల్త్ శాఖ, గ్రామాల్లోని పాఠశాలల్లో పంచాయతీరాజ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, సమగ్ర శిక్ష శాఖల పర్యవేక్షణలో పనులు చేపట్టారు. మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి వసతి, ఫర్నిచర్, మేజర్, మైనర్ మరమ్మతులు, తరగతి గదులు, ప్రహరీల నిర్మాణం, గ్రీన్ చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్‌లు, భవనాలకు రంగులు వేసే పనులు చేపట్టారు.

ఉన్న గదులు కూల్చేశారు..

నిధుల లేమితో పాఠశాలల్లో పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా లేవు. పాఠశాలల్లో ఉన్న తరగతి గదులను కూల్చివేశారు. నూతన గదులు నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు తరగతి గదుల సమస్యను ఎదుర్కొంటున్నారు. నిధులు విడుదల చేయడంలో జాప్యంతో సొంత డబ్బుతో పనులు చేసేందుకు కమిటీలు ముందుకు రావడంలేదు. పనులు చేసి బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో పనులను పూర్తిగా నిలిపివేశారు. ఇప్పట్లో నిధులు విడుదల అయ్యేలా లేవని అధికారులు చెప్పకనే చెబుతున్నారు.

బాపట్ల జిల్లా...

బాపట్ల జిల్లాలో 943 పాఠశాలల్లో పనులు చేపట్టారు. రూ.183.31 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటికి రూ.88.35 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. పాఠశాలల్లో 6,265 పనులు చేపట్టారు. వీటిలో 4,099 పనులు పురోగతిలో ఉన్నాయి. 2,105 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 112 పాఠశాలల్లో 272 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. 11 గదుల నిర్మాణం పూర్తి చేశారు. 326 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌ను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టడం వంటి పనులను చేపట్టగా 153 చోట్ల పనులు పూర్తయ్యాయి. 78 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణ పనులను మంజూరు చేశారు. వీటిలో ఐదు పనులు పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా కోసం 326 పనులు చేపట్టగా 76 పనులు పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టగా 167 పనులను పూర్తి చేశారు.

గుంటూరు జిల్లా..

గుంటూరు జిల్లాలో 914 పాఠశాలల్లో పనులు చేపట్టారు. రూ.203.94 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటికి రూ.107.52 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. 914 పాఠశాలల్లో 6,476 పనులు చేపట్టారు. వీటిలో 3,778 పనులు పురోగతిలో ఉన్నాయి. 2,446 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 75 పాఠశాలల్లో 244 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. తొమ్మిది మాత్రమే అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేశారు. 394 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌ను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టడం వంటి పనులను చేపట్టారు. వీటిలో 190 స్కూల్స్‌లో పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తికాక అనేక స్కూల్స్‌లో మరుగుదొడ్ల వసతి సరిగాలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 100 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణ పనులకు గాను 24 స్కూల్స్‌లో పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 397 పనులు చేపట్టగా 163 పనులు పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టాగా 120 పనులను పూర్తి చేశారు.

పల్నాడు జిల్లాలో ...

పల్నాడు జిల్లాలో 1,281 స్కూల్స్‌లో ఆయా పనులు చేపట్టారు. రూ.312.03 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటికి రూ.152.19 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఐదు ప్రభుత్వం శాఖలకు పనులు అప్పగించారు. 1301 పాఠశాలల్లో 8,349 పనులు చేపట్టారు. వీటిలో 5,217 పనులు పురోగతిలో ఉన్నాయి. 3,127 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. స్కూళ్ళలో 174 ప్యాకేజీల కింద 759 అదనపు తరగతి గదుల నిర్మాణం మంజూరు చేశారు. అయితే 25 మాత్రమే అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయినట్టు సంబంధిత శాఖల లెక్కలు తెలియజేస్తున్నాయి. పాఠశాలల విలీనంతో తరగతి గదులు చాలక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. గదుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 547 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌ను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టడం వంటి పనులను చేపట్టాలి. 139 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. అనేక స్కూల్స్‌లో మరుగుదొడ్ల వసతి సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 91 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణం చేపట్టగా 27 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 553 పనులు చేపట్టగా 216 పనులు పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 913 చేపట్టగా 265 పనులను మాత్రమే పూర్తి చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(శుక్రవారం)
సహారీ (ఉదయం) 4.54 (శనివారం)

రథాలు.. రెడీ

చిలకలూరిపేట, మార్చి 21: ఎన్నికల ప్రచార రథాలు.. అయితే చలో చిలకలూరిపేట! కేరళ, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి ఎన్నికల ప్రచార రథాల కోసం అభ్యర్థుల

- ఎన్నికల ప్రచార రథాలకు కేరాఫ్ చిలకలూరిపేట

అనుచరులు పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు తరలివస్తున్నారు. ఇక్కడ ఏ పార్టీకి చెందిన అభ్యర్థులకైనా ప్రచార రథాలను నాలుగైదు రోజుల్లో తయారుచేసి ఇస్తున్నారు. అభ్యర్థులకు నచ్చేరీతిలో వాహనాలకు పెయింటింగ్, స్టిక్కరింగ్ చేస్తున్నారు. దీనికి తోడు జనరేటర్, లైటింగ్, మైక్ సిస్టం కూడా వాహనానికి అమర్చి ఇస్తున్నారు. అభ్యర్థులు సులభంగా వాహనాలు ఎక్కేందుకు వీలుగా వెనుక వైపు మెట్లు తయారుచేసి మెట్లపై మ్యాట్ కూడా వేసి ఇస్తున్నారు. అభ్యర్థులు వారి వారి నియోజకవర్గాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా సులువుగా ప్రచారం చేసేందుకు వీలుగా ఈ రథాలను సిద్ధం చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థులకు ఇప్పటికే సుమారు 60 వాహనాలు ఇక్కడ సిద్ధం చేసి ఇచ్చారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సుమారు 35 వాహనాలు ఇక్కడే తయారుచేసి ఇచ్చారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా ప్రచార రథాల కోసం ఇక్కడికి బారులు తీరుతున్నారు. కేరళలో బీజేపీ తరఫున ఎన్నికల్లో పోటీ చేయబోతున్న కేంద్రమంత్రి వి.మురళీధరన్ ప్రచార రథాన్ని ఇప్పటికే ఇక్కడ సిద్ధం చేశారు. ఆ రథానికి మలయాళం భాషలో స్టిక్కరింగ్ చేశారు. నారా లోకేష్ (తెలుగుదేశం), అవినాష్ రెడ్డి (వైసీపీ, కడప) లోకం మాధవి (జనసేన, నెల్లిమర్ల, విజయనగరం) మాగుంట (తెలుగుదేశం, ఒంగోలు) తదితరుల ప్రచారరథాలు ఇక్కడ సిద్ధమయ్యాయి.










ముస్తాబైన ఎన్నికల ప్రచార రథాలు

ఈ ప్రచార రథాల రూపకర్త చిలకలూరిపేటకు చెందిన షేక్ కరిముల్లా. ఆటోలు, మినీ వాహనాలకు బాడీ బిల్డింగ్ చేయడంలో, గ్రిల్స్ కట్టడంలో ఆయనకు 25 సంవత్సరాల అనుభవం ఉంది. చిలకలూరిపేటలోని జాతీయ రహదారిపై ఏఎంజీ పక్కన కరీముల్లా ఆర్క్ వెల్డింగ్ వర్క్స్ పేరుతో ఈ యువకుడు ఏర్పాటుచేసిన షెడ్డులో ఎన్నికల ప్రచార రథాలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా ప్రచార రథాల గురించి వివరిస్తూ కరీముల్లా ఇప్పటివరకు అన్ని పార్టీలకు సంబంధించిన సుమారు 100 ప్రచార రథాలను సిద్ధం చేసి ఇచ్చాము. ఇప్పుడు మా చేతిలో మరో 10 ప్రచార రథాలకు ఆర్డర్లు ఉన్నాయి. ఒక్కో ప్రచార రథాన్ని అన్ని రకాలుగా ముస్తాబు చేసి ఇవ్వడానికి సుమారు రు.4.5 లక్షలు ఖర్చు అవుతుంది. వాహనాలను మాత్రం అభ్యర్థులే తమకు నచ్చిన కంపెనీల నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. ముఖ్యంగా ఇసుజు, బొలెరో వాహనాలను అభ్యర్థులు తీసుకువస్తున్నారు."



షేక్ కరీముల్లా

ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదు

- కోడ్ అమల్లో ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ ఉద్యోగులకు జిల్లా ఎన్నికల అధికారి సూచన

బాపట్ల, మార్చి 21: రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదని, కార్యక్రమాల్లో వారి ప్రమేయం ఉండరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజకీయపార్టీల ప్రచారంలో ఉద్యోగులు పాల్గొన్నట్లు ఫిర్యాదులు వస్తే తక్షణమే వారిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అధికారులకు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. ఎన్నికల విధుల నిర్వాహణకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ఎన్‌ఐసీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు 12,927 మంది ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు పోర్టల్ లో పొందుపరిచామన్నారు. మిగిలిపోయిన వారి వివరాలను తక్షణమే నిక్షిప్తం చేయాలన్నారు. ఒప్పంద ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. ఎన్నికల విధులు నుంచి ఉద్యోగులకు ఎలాంటి మినహాయింపు లేదని తెలిపారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా యంత్రాంగం సహకరించాలని కలెక్టర్ కోరారు. జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులైన ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల విధులు కేటాయిస్తామన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరైతే అలాంటి ఉద్యోగులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

స్వీయ ఫాం-7లపై పోలీసులకు ఫిర్యాదు

- అధికారుల విచారణలో ఓటర్లు దాఖలు చేయలేదని నిర్ధారణ

అద్దంకి, మార్చి 21: అద్దంకి నియోజకవర్గంలో ఓటర్లకు తెలియకుండానే స్వీయ ఫాం-7లు దాఖలుపై అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ మద్దతుదారుల ఓట్ల తొలగింపునకు వారికి తెలియకుండానే 1077 స్వీయ ఫాం-7లు దాఖలుపై ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. ఓటర్లకు తెలియకుండానే వారి ఓట్లు తొలగించాలని వేరే వ్యక్తులు ఫాం-7 దాఖలు చేసినట్లు క్షేత్రస్థాయి విచారణలో అధికారులు తేల్చారు. అద్దంకి పట్టణంలో 68, మండలంలో 439, బల్లికురవ 279, సంతమాగులూరు 150, కొరిశపాడు 25, పంగులూరు మండలంలో 116 స్వీయ ఫాం-7లు దాఖలు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో నకిలీ స్వీయ ఫాం-7లు దాఖలుపై ఆయా పోలీస్ స్టేషన్లలో గురువారం తహసీల్దార్లు, అద్దంకి మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదులు చేశారు.

వెంకటేశ్‌కు ఈసీ నోటీసు

- తాయిలాలు పంపిణీ చేసిన వైసీపీ చీరాల అభ్యర్థి
- టీడీపీ నేత ఫిర్యాదుపై స్పందించిన ఎన్నికల సంఘం

చీరాల, మార్చి 21: విలేకర్లకు తాయిలాలు పంపిణీ చేసిన వైసీపీ చీరాల నియోజకవర్గ అభ్యర్థి కరణం వెంకటేశ్‌కు ఈసీ నోటీసు జారీ చేసింది. ఈ నెల 14న నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో విలేకర్లకు ప్యాంట్, షర్ట్, చీర, కొంత నగదు ఉన్న గిఫ్ట్ కిట్లను ఆయన అందజేశారు. ఇందుకు సంబంధించి టీడీపీ రాష్ట్ర నేత ఒకరు ఈసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఈసీ ఆరా తీసింది. తాయిలాలు పంపిణీ చేసిన వెంకటేశ్‌కు ఈసీ నోటీసు జారీ చేసింది. నోటీసు విషయమై చీరాల ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణరెడ్డిని వివరణ కోరగా తాయిలాల పంపిణీపై టీడీపీ నేత ఫిర్యాదు మేరకు ఈసీ నోటీసు అందిందన్నారు. దానిని సంబంధీకులకు ఇస్తామన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న 14వతేదీకి కోడ్ అమలులో లేదన్నారు. ఎన్నికల నియమావళిని ఏ పార్టీ అతిక్రమించినా వారిపై తప్పకుండా చర్యలు ఉంటాయన్నారు.

మహి
కల ప్రీమియర్ లీగ్ ముగిసిందో..
లేదో.. అంతకు మించిన వినోదం రెడీగా ఉంది.
16 ఏళ్లుగా వన్నె తరగని రీతిలో అంతకంతకూ ఆకర్షణ పెంచుకుంటూ వస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్‌కు తెర లేవనుంది. ఇక రెండు నెలల పాటు బ్యాటర్ల బాదుడు.. ఫీల్డర్ల మెరుపు విన్యాసాలు.. బౌలర్ల అబ్బురపరిచే బంతులను ఈ క్రేజీ లీగ్‌లో మైమరిచి చూసేందుకు క్రికెట్ ప్రేమికులంతా సిద్ధంగా ఉండాల్సిందే. అలాగే రానున్న టీ20 వరల్డ్‌కప్‌లో బెర్త్ దక్కించుకునేందుకు యువ ఆటగాళ్లతో పాటు వెటరన్స్‌కు కూడా ఈ లీగ్ కీలకమే. దీనికి తోడు డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌తో ఆరంభమే ఘనంగా ఉండబోతోంది.

ధనాధన్‌కు సిద్ధమా!

నేటి నుంచే ఐపీఎల్ 17వ సీజన్

చెన్నై x బెంగళూరు మధ్య ఆరంభ పోరు

రాత్రి 8.00 నుంచి స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో..

చెన్నై సారథి రుతురాజ్



కెప్టెన్సీ వదిలేసిన ధోనీ
సీజన్‌లో ఆడతాడు : కోచ్ ఫ్లెమింగ్

చెన్నై: ఐపీఎల్ ఆరంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ సారథి ధోనీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 16 ఏళ్లుగా ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా పేరు తెచ్చుకున్న ఎంఎస్ ధోనీ అనూహ్యంగా నాయకత్వ బాధ్యతలనుంచి వైదొలుతున్నట్టు ప్రకటించాడు. దీంతో ఇక నుంచి యువ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ జట్టును నడిపిస్తాడని సీఎస్కే వెల్లడించింది. లీగ్ ఆరంభానికి సరిగ్గా ఒకరోజు ముందు, ఎలాంటి ఊహాగానాలు లేకుండానే వెలువడిన ఈ వార్త అటు సీఎస్కే అభిమానులతో పాటు క్రికెట్ ప్రేమికులను కూడా షాక్‌లో ముంచింది. 'ఎంఎస్ ధోనీ తన కెప్టెన్సీని రుతురాజ్‌కు అప్పగించాడు. 2019 నుంచి గైక్వాడ్ జట్టులో భాగంగా ఉంటూ 52 మ్యాచ్‌లు ఆడాడు. అతడి నాయకత్వంలో జట్టు రాణిస్తుందని ఆశిస్తున్నాం' అని సీఎస్కే పేర్కొంది. శుక్రవారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో సీఎస్కే జట్టు రుతురాజ్ నేతృత్వంలోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ఆడనుంది. అయితే 27 ఏళ్ల రుతురాజ్‌కు కెప్టెన్‌గా చేయడం ఇదేం తొలిసారి కాదు. 2023 ఆసియా గేమ్స్‌లో భారత క్రికెట్ జట్టు అతడి ఆధ్వర్యంలోనే స్వర్ణం సాధించింది. దేశవాళీల్లో మహారాష్ట్ర జట్టుకు కూడా తనే కెప్టెన్. అలాగే గతేడాది తమ ఫ్రాంచైజీని చాంపియన్‌గా నిలపడంలో బ్యాటర్‌గా రుతురాజ్ పాత్ర కీలకం. ఆడిన 16 మ్యాచ్‌ల్లో 147.50 స్ట్రయిక్ రేట్‌తో 590 పరుగులు చేశాడు. వాస్తవానికి 2019లో జట్టులోకి వచ్చిన రుతురాజ్ పూర్తిగా బెంచీకే పరిమితమయ్యాడు. ఆ తర్వాత ఏడాది ఆరు మ్యాచ్‌లు ఆడగలిగాడు. కానీ 2021లో అద్భుతంగా చెలరేగి ఆరెంజ్ క్యాప్ (635) గెలుచుకోగా.. 2022లోనూ జట్టు తరఫున అతడివే అత్యధిక పరుగులు (368). అయితే విశేష అభిమానగణం ఉన్న సీఎస్కే నయా కెప్టెన్‌గా ఇప్పుడు ఏమేరకు రాణించగలడనేది వేచిచూడాల్సిందే..

మహీయే వదిలేశాడు..

సీఎస్కే జట్టులో ధోనీ అంతర్భాగం. ఈ ఫ్రాంచైజీలో అతడేం చెబితే అదే జరుగుతుంది. ముంబై ఇండియన్స్ తరహాలో హార్దిక్‌ను కెప్టెన్‌గా చేసిన తీరును ఇక్కడ చూడలేం. అంతా ఎంఎస్ ఇష్టప్రకారమే జరిగిందని సాక్షాత్తూ సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథ్ తెలిపాడు. 'జట్టు ప్రయోజనాల కోసమే ధోనీ ఆలోచనలు ఉంటాయి. అతడి తాజా నిర్ణయం గురించి నాకు ఐపీఎల్ కెప్టెన్ల సమావేశానికి ముందు మాత్రమే తెలిసింది. కెప్టెన్‌గా వైదొలగడం కేవలం అతడి ఇష్టపూర్వకంగానే జరిగింది. మనం అతడి నిర్ణయాన్ని గౌరవించాల్సిందే' అని కాశీ తెలిపాడు.

గైక్వాడ్‌కు జై..

ముంబై కెప్టెన్‌గా హార్దిక్‌ను నియమించినపుడు సోషల్ మీడియాలో అభిమానుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. కానీ రుతురాజ్‌పై మాత్రం సీఎస్కే ఫ్యాన్స్ అభిమానం కురిపిస్తుండడం విశేషం. ఓ దేశవాళీ మ్యాచ్‌లో ఎంఎస్ నుంచి ఆటోగ్రాఫ్ తీసుకున్న రుతురాజ్.. నేడు అతడి నుంచే సారథ్యం అందుకోవడం భేష్ అంటూ కొనియాడుతున్నారు. అలాగే ఎంఎస్ 26 ఏళ్ల వయస్సులో దేశానికి టీ20 వరల్డ్ కప్ అందించి.. 27 ఏళ్లకు సీఎస్కే కెప్టెన్ అయ్యాడని.. అలాగే 26 ఏళ్ల రుతురాజ్ భారత్‌కు ఆసియాకప్ స్వర్ణం అందించి.. 27 ఏళ్లప్పుడే సీఎస్కే సారథి అయ్యాడని ఫ్యాన్స్ గుర్తుచేసుకుంటున్నారు.

ఇదే ఆఖరు!

ఐపీఎల్‌లో 2008 నుంచి సీఎస్కేను ఎంఎస్ అత్యద్భుత జట్టుగా మార్చాడు. అయితే జట్టు ఇప్పుడు సంధి దశలో ఉంది. బహుశా 42 ఏళ్ల ధోనీకిదే చివరి ఐపీఎల్. అందుకే జట్టులో తను కొనసాగినప్పుడే మరొకరికి పగ్గాలు అప్పజెప్పాలనుకున్నాడు. వాస్తవానికి 2022లోనే ధోనీకి ఈ ఆలోచన వచ్చి జడేజాను ముందుకు తెచ్చాడు. కానీ కేవలం 8 మ్యాచ్‌ల తర్వాత తిరిగి ధోనీయే నాయకుడయ్యాడు. అప్పుడు ఆ నిర్ణయం వర్కౌట్ కాలేదు కానీ ఈసారి అలా కాదని సీఈవో విశ్వనాథన్ చెబుతున్నాడు. అప్పట్లో తాము కూడా ఎంఎస్ నుంచి కెప్టెన్సీ మార్పునకు సిద్ధంగా లేమని, కానీ ఇప్పుడు ఆ పాత్రకు యువ ఆటగాళ్లను తయారుచేయాల్సిన అవసరం ఏర్పడిందని కోచ్ ఫ్లెమింగ్ చెప్పాడు. మరోవైపు ధోనీ బరిలోకి దిగుతాడా? లేదా? అని ఫ్యాన్స్ సందేహిస్తున్నారు. కొంతకాలం క్రితమే ధోనీ మోకాలికి సర్జరీ కూడా అయ్యింది. కానీ వీటన్నింటికి చెక్ పెడుతూ.. ఎంఎస్ సీజన్ మొత్తానికి అందుబాటులో ఉంటాడని ఫ్లెమింగ్ తేల్చాడు. గత సీజన్‌తో పోలిస్తే ఇప్పుడు తను మరింత ఫిట్‌గా ఉన్నాడని చెప్పాడు.

కెప్టెన్‌గా ఎంఎస్ కెరీర్

ఐపీఎల్ ఆరంభం నుంచి చెన్నై కెప్టెన్‌గా కొనసాగిన ధోనీ రికార్డు స్థాయిలో ఐదు టైటిళ్లు అందించాడు. 2010, 2011, 2018, 2021, 2023లో విజేతగా నిలిచిన జట్టు తాజాగా డిఫెండింగ్ చాంపియన్‌గానే బరిలోకి దిగుతోంది. అలాగే రెండుసార్లు చాంపియన్స్ లీగ్‌లోనూ విజేతగా నిలిపాడు. లీగ్‌లో అత్యధిక మ్యాచ్‌లకు కెప్టెన్సీ (226) వహించిన రికార్డు కూడా ధోనీదే. ఇందులో 133 విజయాలు, 91 ఓటములు, రెండు ఫలితం తేలనివి ఉన్నాయి. మొత్తంగా సీఎస్కే, రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ తరఫున 250 మ్యాచ్‌లను ఆడిన ఎంఎస్ 5082 పరుగులు సాధించాడు.

'తలా' దర్శనం లేకపాయె..

ఎంఎస్ ధోనీని విపరీతంగా ఆరాధించే అభిమానులు అతడిని నెట్స్‌లో చూసేందుకు కూడా ఎగబడుతుంటారు. ఈ క్రమంలో గతంలో చిదంబరం స్టేడియం ప్యాక్ అయిన వీడియోలు చక్కర్లు కొట్టేవి. కానీ ఈసారి ముందుగానే తమ ఆరాధ్య 'తలా' దర్శనం చేసుకునేందుకు ఫ్యాన్స్‌కు వీలు కాలేదు. ఎందుకంటే.. దేశంలో సాధారణ ఎన్నికల నేపథ్యంలో అభిమానుల కోసం స్టాండ్స్‌ను తెరిచేందుకు స్థానిక పోలీసులు అనుమతించలేదు. వేలాది ఫ్యాన్స్ తరలివస్తారు కాబట్టే భద్రత కోసం పోలీసుల అనుమతి తీసుకోవడం అవసరం. దీంతో ఏప్రిల్ 19 ఎన్నికల తర్వాత ఫ్యాన్స్‌ను నెట్స్‌లోకి అనుమతించాలని సీఎస్కే భావిస్తోంది.



మెగాలీగ్ కెప్టెన్లు

రాహుల్ (లఖ్‌నవూ)
కమిన్స్ (సన్‌రైజర్స్)
జితేశ్ (పంజాబ్ వైస్‌కెప్టెన్)
రుతురాజ్ (చెన్నై)
రిషభ్ పంత్ (ఢిల్లీ)
డుప్లెసి (బెంగళూరు)
గిల్ (గుజరాత్)
శాంసన్ (రాజస్థాన్)
హార్దిక్ (ముంబై)
శ్రేయాస్ (కోల్‌కతా)

చెన్నై: టీ20 ప్రపంచకప్‌నకు ముందే అభిమానులకు కావాల్సినంత వినోదం లభించనుంది. నేటి నుంచే ఐపీఎల్ 17వ సీజన్ ఆరంభం. అయితే ఈసారి లీగ్ సమయంలోనే దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగనుండడంతో ప్రస్తుతానికి 15 రోజుల షెడ్యూల్‌నే ప్రకటించారు. దీనిలో భాగంగా శుక్రవారం నుంచి ఏప్రిల్ 7 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరుగబోతున్నాయి. ఈమేరకు మొత్తంగా పది జట్లు, పది వేదికల్లో 21 మ్యాచ్‌ల్లో తలపడతాయి. మిగతా షెడ్యూల్ స్వదేశంలో ఉంటుందా? తటస్థ వేదికల్లో నిర్వహిస్తారా? అనేది తేలాల్సి ఉంది. మరోవైపు జాతీయ జట్టులో సహచరులుగా ఉన్న వారే ఇక మైదానంలో ప్రత్యర్థులుగా సవాల్ విసురనున్నారు. అటు ఫ్యాన్స్ కూడా తమ ఫ్రాంచైజీల వారీగా విడిపోయి విదేశీ ఆటగాళ్లకైనా జేజేలు పలికేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపుగా అన్ని జట్లలో పలువురు కీలక ఆటగాళ్లు గాయాలతో దూరమైనా.. ఏ మాత్రం కళ తప్పని ఈ లీగ్‌లో స్టార్ ప్లేయర్లతో పాటు యువ ఆటగాళ్లు కూడా ఆకట్టుకోవాలనుకుంటున్నారు. అలాగే కారు ప్రమాదం నుంచి కోలుకుని తిరిగి బ్యాట్ పట్టనున్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషభ్ పంత్ ఎలా రాణిస్తాడనేది ఫ్రాంచైజీతో పాటు భారత టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఆత్రుతగా ఎదురుచూస్తోంది..

విరాట్‌కు కీలకం



తాజా లీగ్‌లో అందరికళ్లూ విరాట్ కోహ్లీపైనే ఉండనున్నాయి. ధనాధన్ ఫార్మాట్‌లో యువ ఆటగాళ్లు దూసుకువస్తుండడంతో టీ20 జట్టులో విరాట్ స్థానం సందేహంగా మారింది. ఈ లీగ్ ముగిశాక జూన్ 2 నుంచి టీ20 వరల్డ్‌కప్ ఉండడంతో ఆయా ఆటగాళ్ల ఫామ్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇప్పటికే విరాట్‌కు చోటు సందేహ మనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీంతో ఈ ఐపీఎల్‌లో తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. 2022 టీ20 వరల్డ్‌కప్ ముగిశాక విరాట్ ఆడింది కేవలం రెండు టీ20 మ్యాచ్‌లే కావడం గమనార్హం. వాస్తవానికి తన టీ20 ఫామ్ మరీ అంత పేలవంగా ఏమీ లేదు. 117 మ్యాచ్‌ల్లో 138.15 స్ట్రయిక్ రేట్‌తో ఈ ఫార్మాట్‌లో అత్యధికంగా 4,037 పరుగులు సాధించాడు.

ఆటలో 'విలువ' కనిపిస్తుందా?

డిసెంబరులో జరిగిన ఐపీఎల్ వేలంలో కనీవినీ ఎరుగని రీతిలో పలువురు ఆటగాళ్లను ఆయా ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్‌ను కోల్‌కతా జట్టు ఏకంగా రూ.24 కోట్ల 75 లక్షలకు తీసుకుంది. తమ పేస్ దళానికి ప్రధాన ఆయుధంగా పనికివస్తాడనే భావనలో కేకేఆర్ ఈ రికార్డు ధరకు మొగ్గు చూపింది. ఇక ప్యాట్ కమిన్స్ కోసం సన్‌రైజర్స్ రూ.20 కోట్ల 50 లక్షలను వెచ్చించింది. ఆసీస్‌కు టీ20 ప్రపంచకప్‌ను అందించినట్టే తమకు కూడా టైటిల్‌ను అందిస్తాడనే ఆశతో కెప్టెన్‌గానూ నియమించుకుంది. ఇక కామెరూన్ గ్రీన్‌ను ముంబై నుంచి బెంగళూరు రూ.17.50 కోట్లకు తీసుకుంది. వీరే కాకుండా కొందరు అనామక ఆటగాళ్లు కూడా కోట్లు పలికారు. ఈ విలువైన క్రికెటర్లు ఫ్రాంచైజీల ఆశలను తీరుస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.

బోణీ కొట్టేదెవరో?

టోర్నీ ఆరంభానికి ఒక్క రోజు ముందు ఎంఎస్ ధోనీ నాయకత్వం నుంచి తప్పుకొన్నాడు. కొత్త కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్..డుప్లెసి నేతృత్వంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తాజా ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. దీంతో తొలి మ్యాచ్‌లోనే భారత అభిమానులకు ధోనీ వర్సెస్ కోహ్లీ పోరు చూసే అవకాశం దక్కింది. సీఎస్కే టైటిల్ కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా.. ఆర్‌సీబీ మాత్రం తీవ్ర ఒత్తిడిలోనే బరిలోకి దిగబోతోంది. డబ్ల్యూపీఎల్‌లో తమ ఫ్రాంచైజీ విజేతగా నిలవడంతో బెంగళూరు అభిమానుల ఫోకస్ పురుషుల జట్టుపైకి మారింది. పేరుతో పాటు జెర్సీలోనూ మార్పు చేసుకున్న ఈ జట్టు 16 ఏళ్లుగా ఊరిస్తున్న ఐపీఎల్ ట్రోఫీని ఎలాగైనా అందుకోవాలనే కసితో ఉంది. కొన్నేళ్లుగా ఇదే చివరి లీగ్‌గా అందరూ భావిస్తున్నా ధోనీ మాత్రం ప్రతీ సీజన్‌లో ఫ్యాన్స్‌ను మురిపిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు కూడా 42 ఏళ్ల వయస్సులో అత్యంత ఫిట్‌గా కనిపిస్తూ సీఎస్కే ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నాడు. ఇక ఓపెనర్ కాన్వే, పేసర్ పథిరన గాయాలతో ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నారు. ధోనీతో పాటు రుతురాజ్, మిచెల్, జడేజా, రహానె, రచిన్, దీపక్, తుషార్ కీలక ఆటగాళ్లు. అటు ఆర్‌సీబీకి మాత్రం గాయాల బెడద లేకుండా ఆటగాళ్లంతా ఫిట్‌గా ఉన్నారు. కోహ్లీ కూడా సుదీర్ఘ విరామంతో తాజాగా కనిపిస్తున్నాడు. డుప్లెసి, మ్యాక్స్‌వెల్, దినేశ్ కార్తీక్, గ్రీన్, పటీదార్‌లతో ఆర్‌సీబీ బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. పేసర్లు సిరాజ్, జోసెఫ్, ఫెర్గూసన్‌లపై జట్టు బౌలింగ్‌లో ఆధారపడి ఉంది.



క్వార్టర్స్‌లో గాయత్రి, రజావత్



బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో గాయత్రి గోపీచంద్ జంట, ప్రియాన్షు రజావత్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. గురువారం జరిగిన మహిళల డబుల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 21-10, 21-12తో సహచర ద్వయం ప్రియ/శృతీ మిశ్రాపై సునాయాసంగా నెగ్గింది. పురుషుల సింగిల్స్ రౌండ్-16 పోరులో రజావత్ 21-14, 21-13తో లీ లాన్ జీ (చైనా)ను చిత్తు చేసి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. ఇక మహిళల డబుల్స్ మరో రెండో రౌండ్‌లో అశ్వినీ పొన్నప్ప జంట పరాజయం పాలైంది. జపాన్‌కు చెందిన హిరోకామీ/కటోతో జరిగిన మ్యాచ్‌లో అశ్విని/తనీషా క్రాస్టో 17-21, 16-21తో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

'ద హండ్రెడ్'లో భారత్ నుంచి ఇద్దరే!



లండన్: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్ చాంపియన్ జట్టు ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన, కీపర్ రిచా ఘోష్‌కు మాత్రమే రాబోయే 'ద హండ్రెడ్' లీగ్‌లో చోటు దక్కింది. సదరన్ బ్రేవ్ జట్టు మంధానను తీసుకోగా, ఆమె ఆర్సీబీ సహచరి రిచా ఘోష్‌పట్ల బర్మింగ్‌హామ్ ఫినిక్స్ జట్టు మొగ్గు చూపింది. ఎడమచేతి వాటం బ్యాటర్ స్మృతి తాజా డబ్ల్యూపీఎల్ 10 మ్యాచ్‌ల్లో 300 రన్స్‌తో సత్తా చాటింది. మరోవైపు ఫినిషర్‌గా అదరగొట్టిన ఘోష్ 10 మ్యాచ్‌ల్లో 142 స్ట్రయిక్ రేట్‌తో, రెండు అర్ధ శతకాలు సహా 257 పరుగులు సాధించింది. ఇన్నింగ్స్‌కు 100 బంతుల చొప్పున ఉండే ఈ లీగ్ లండన్‌లో జూలై 23 నుంచి జరగనుంది. మొత్తం ఎనిమిది జట్లు టోర్నమెంట్‌లో తలపడనున్నాయి. భారత్ నుంచి హర్మన్‌ప్రీత్, దీప్తిశర్మ, జెమీమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్ సహా మొత్తం 17 మంది భారత క్రికెటర్లు హండ్రెడ్ లీగ్ డ్రాఫ్ట్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ జట్లేవీ వారిని తీసుకొనేందుకు ఆసక్తి చూపలేదు.

పారిస్ ఒలింపిక్స్

భారత పతాకధారి శరత్ కమల్

చెఫ్ డి మిషన్‌గా మేరీకోమ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత పతాకధారిగా వెటరన్ టీటీ ఆటగాడు శరత్ కమల్ వ్యవహరించనున్నాడు. ఈమేరకు కామన్వెల్త్ క్రీడల చాంపియన్ శరత్ పేరును భారత ఒలింపిక్ సంఘం గురువారం ప్రకటించింది. అలాగే దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌ను చెఫ్ డి మిషన్‌గా ఎంపిక చేసింది. కాగా..ర్యాంకింగ్స్ ఆధారంగా భారత పురుషులు, మహిళల టీటీ జట్లు పారిస్ ఒలింపిక్స్ టీమ్ విభాగాలకు అర్హత సాధించిన విషయం విదితమే. 'క్రీడల పట్ల అసమాన అంకితభావం, ఎందరికో స్ఫూర్తిగా నిలిచే మేరీకోమ్ చెఫ్ డి మిషన్‌గా భారత అథ్లెట్లకు మార్గదర్శనం చేయనుంది' అని ఐఓఏ తెలిపింది.

ఐపీఎల్‌కు జంపా దూరం

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆరంభానికి ముందు రాజస్థాన్ రాయల్స్‌కు గట్టిదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా ఆటగాడు ఆడమ్ జంపా మెగా లీగ్ నుంచి వైదొలిగాడు. జంపాను రాజస్థాన్ రూ. 1.5 కోట్లకు రిటైన్ చేసుకొంది. అయితే, గత కొంతకాలంగా తీరికలేని క్రికెట్ ఆడుతున్న జంపా విశ్రాంతి నిమిత్తం తప్పుకొన్నట్టు తెలుస్తోంది. జంపా తప్పుకోవడంతో స్పిన్ భారం అశ్విన్, యజ్వేంద్ర చాహల్‌పైనే పడనుంది. గత సీజన్‌లో రాయల్స్ తరఫున ఆరు మ్యాచ్‌లు ఆడిన జంపా 8 వికెట్లు పడగొట్టాడు.

కోడ్ ఉంది.. పోలీసుల తీరు మారాలి



● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి21: ముగ్గురు ఎస్పీలకు ఎన్నికల సంఘం ప్రశ్నలతోనైనా జగన్ భక్త పోలీసుల తీరు మార్చుకుంటే మేలని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పట్టణంలోని తన నివాసగృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీలు స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఈసీ ఆదేశించటం తీవ్రతను ఇకనైనా వారు అర్థం చేసుకోవాలన్నారు. ఈసీ శ్రీముఖాలతోనైనా ప్రకాశం, పల్నాడు, నంద్యాల జిల్లాల ఎస్పీలు పరమేశ్వరరెడ్డి, రవి శంకర్‌రెడ్డి, రఘు వీరారెడ్డిలు వైసీపీ భక్తి మత్తు నుంచి బయట పడి విధి నిర్వహణ పై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కోడ్ వచ్చిన దగ్గర నుంచి జిల్లాలో ఎలాంటి అవాంఛ నీయ హింసాత్మక ఘటనలు జరిగినా ఎస్పీలనే బాధ్యులను చేస్తామని ఎన్నికల సంఘం ముందే ప్రకటించినా ఇప్పటికీ వైసీపీ అరాచకాలకు కొమ్ము కాస్తుండటమే దారుణమైన విషయం ఆయన అన్నారు. పల్నాడు వంటి అత్యంత సమస్యాత్మక ప్రాంతానికి ఎస్పీగా ఉన్న వ్యక్తి కూడా ఈ జాబితాలో ఉండటం మరింత ఆందోళన కలిగిస్తున్న విషయం అన్నారు. పోలీసులతో పాటు మిగిలిన అధికారులు కూడా కోడ్ అమల్లోకి వచ్చిన విషయాన్ని ఇక మీదటైనా గమనంలో పెట్టుకోకపోతే తరువాత వారంతా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాజకీయాల కార్యకలాపాల్లో జోక్యం చేసుకుంటున్న వాలంటీర్ వ్యవస్థపైనా మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు.





గ్రామంలో పంచాయతీ సరఫరా చేసిన ఆకుపచ్చ రంగులో నీళ్ల బాటిల్, పోలీసులకు నీటి సమస్యను వివరిస్తున్న స్థానికులు

కోడ్ ఉందంటూ నీటి సరఫరా నిలిపివేత

కాకుమాను, మార్చి 21: గ్రామంలోని ప్రజల నీటి సమస్య పరిష్కారం కోసం దాతలు నీటి ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తుంటే... అనుమతి లేదని అధికారులు హెచ్చరించడంపై స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన మండల కేంద్రమైన కాకుమానులో గురువారం చోటు చేసుకుంది. గ్రామంలో వారం రోజుల నుంచి పంచాయతీ నీటి సరఫరా ఆపివేసింది. గ్రామంలోని ప్రజల తాగునీటి సమస్య తీవ్రత దృష్ట్యా దాతలు వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై అధికారులకు సమాచారం ఇవ్వడంతో ట్యాంకర్‌ను నిలిపివేసి నీటి సరఫరా కోసం అనుమతి ఉందా.. లేకుంటే కేసులు పెడతామని, అరెస్టులు చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, ఎంపీడీవో రామకృష్ణ కూడా పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న స్థానికులపై దురుసుగా ప్రవర్తించారు. మహిళలు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటే గ్రామంలో తాగునీరు సరఫరా చేయకూడదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ స్క్వాడ్ పోలీసులు పంచాయతీ కార్యాలయం నుంచి ప్రజలను బలవంతంగా పంపివేశారు.



జగన్ పాలనలో రాష్ట్రం అధోగతిపాలు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

● టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నాలక్ష్మీనారాయణ
● పెదకూరపాడు నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 60 కుటుంబాలు..

అమరావతి, మార్చి 21: ఒక్క చాన్స్ ఇవ్వండంటూ కపట ప్రేమ ఒలకబోసి అధికారంలోకి వచ్చిన జగన్ మరోసారి అధికారం ఇస్తే మన ఆస్తులు కూడా దక్కవని మాజీమంత్రి సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం పెదకూరపాడు నియోజకవర్గం అమరావతి గ్రామంలో పల్నాడు జిల్లా కాపునాడు అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో 60 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారికి ఇరువురు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ వైసీపీ పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో 20 సంవత్సరాల వెనక్కిపోయిందని అన్నారు. బటన్ నొక్కుడు పేరుతో ప్రజలకు పది రూపాయలు ఇచ్చి వెయ్యి లాక్కుంటూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి సంయుక్త కృషితో గెలుపు సాధ్యం అవుతుందన్నారు. వైసీపీ పాలనపై విసుగుచెంది అధికార పార్టీ నుంచి ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సత్యనారాయణను పార్టీలో సముచిత స్థానం కల్పించి గౌరవించడం జరుగుతుందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు కన్నా లక్ష్మీనారాయణ, కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఆదరించారని అదే విధంగా నాపైన మీ ఆశీస్సులు ఉండాలని మనసారా కోరుకుంటున్నానన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు ఏమయ్యాయి?

● టీడీపీ పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



రెడ్డిపాలెం గ్రామస్థులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జీవీ

వినుకొండటౌన్, మార్చి 21: మండలంలోని బొల్లాపల్లి మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు అధికార వైసీపీని వీడి టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు సమక్షంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక జగన్‌రెడ్డి పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలగాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపరుస్తూ ప్రజలు టీడీపీలో చేరుతున్నారని అన్నారు. ఐదేళ్ళ జగన్‌రెడ్డి పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని, రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేశారన్నారు. ఎన్నికలకు ముందు ఏటా డీఎస్సీ ఇస్తానని జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రతి ఏడాది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను దగా చేశారని అన్నారు. నూతన ఇసుక పాలసీతో రాష్ట్రంలో ఇసుక కొరత సృష్టించి భవన నిర్మాణ కార్మిక రంగాన్ని నట్టేట ముంచి ఇసుక మాఫియాను ఏర్పాటు చేసుకొని జగన్‌రెడ్డి వందలకోట్లు దోచుకున్నారన్నారు. మద్యపాన నిషేదం చేస్తానని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి నాశిరకం మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని దుయ్యబట్టారు. సంక్షేమంటూ జగన్‌రెడ్డి ఒక చేత్తో వెయ్యి ఇస్తూ మరో చేత్తో పదివేలు వసూళ్ళు చేస్తున్నారని అన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికలకు ముందు ప్రజలకు అనేక హామీలు గుప్పించి మోసం చేశారని, గుండ్లకమ్మ నదిపై తంగిరాల డ్యామ్ నిర్మిస్తానని, ఎత్తిపోతల పథకాలు తెస్తానని, వరికపూడిశల ప్రాజెక్టు నిర్మించకపోతే నేను మీ ముఖం చూడనని, ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి వేయిస్తానని వాగ్దానం చేసి ప్రజలను దగా చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారిలో శౌరి బాబు, ఉల్లిగడ్డల బాజి, బాబు, ఆకాష్, మరియబాబు, జక్క నాగరాజు, చేవూరి నాగరాజు, పెద్ద మరియన్న ఉన్నారు. జరపాల గోవిందు, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అశ్రునయనాలతో గుంటుపల్లి అంతిమయాత్ర

● పాల్గొన్న టీడీపీ ఉమ్మడి జిల్లా నేతలు
● పాడె మోసిన యరపతినేని, కొల్లు రవీంద్ర, చదలవాడ



నివాళులర్పిస్తున్న నక్కా ఆనందబాబు, కొల్లు రవీంద్ర, యరపతినేని

దాచేపల్లి,మార్చి 21: టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు, నవ్యాంధ్రప్రదేశ్‌లో ఒకసారి రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్‌గా పనిచేసి అనారోగ్యంతో మృతి చెందిన గుంటుపల్లి నాగేశ్వరరావు అంతిమ యాత్రలో టీడీపీకి చెందిన మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీలో రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు పాల్గొన్నారు. గురువారం దాచేపల్లిలోని బీసీ కాలనీలో గుంటుపల్లి నివాసం నుంచి శ్మశాన వాటిక వరకు భారీ అంతిమయాత్ర నిర్వహించారు. గుంటుపల్లికి అంతిమసంస్కారం జరుగుతుండగా బీసీలకుచెందిన మంచి నాయకుడిని పార్టీ కోల్పోయిందని, తనకు చేదోడువాదోడుగా వుంటూ పార్టీ కార్యక్రమాలలో చురుగ్గాపాల్గొన్న గుంటుపల్లి ఆకస్మిక మరణం తనెంతగానో బాధించిందని యరపతినేని కన్నీటిపర్యంతమ య్యారు. గుంటుపల్లి పాడెను మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర, మాజీమంత్రి నక్కా ఆనంద బాబు, పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా, నరస రావుపేట ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతుల మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పెదకూరపాడు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్, కోడెలశివరాం తదితరులు పాల్గొని మోశారు. దాచేపల్లిలోని పురవీధులలో గుంటుపల్లి అంతిమయాత్రసాగగా, పార్టీలతో సంబంధం లేకుండా అన్నివర్గాల నేతలు గుంటుపల్లి నాగేశ్వరరావు భౌతిక దేహానికి నివాళులర్పించారు.



గుంటుపల్లి పాడె మోస్తున్న యరపతినేని, అరవిందబాబు



నిధులు మంజూరు కాకపోయినా సీసీ రోడ్డుకు కీవాల్స్ వేసిన వైసీపీ నేతలు

ఓట్లేయండి.. రోడ్డేస్తాం..

● ఓటర్లను ప్రభావితం చేసేందుకే వైసీపీ నేతల యత్నం

రేపల్లె, మార్చి 21: నిజాంపట్నం మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో అధికార పార్టీ నాయకులు ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా సీసీ రోడ్ల నిర్మాణం కోసం గుట్టుచప్పుడు లేకుండా తెల్లారేసరికి కీవాల్స్ వేశారు. వైసీపీకి చెందిన కీలక నేత మీ ఊరికి రహదారి వేస్తాం మీ ఓట్లన్ని మాకు వెయ్యాలంటూ గత రెండు రోజుల క్రిందట ఆ గ్రామ ప్రజలకు హామీనిచ్చారు. అయితే కొంతమంది గ్రామస్తులు.. పంచాయతీ రాజ్ అధికారుల అనుమతి లేకుండా సీసీ రోడ్లు ఎలా వేస్తారంటూ నిలదీశారు. దీనిపై పంచాయతీ రాజ్ అధికారుల వివరణ కోరగా తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

పోలింగ్ బూతలలో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు..

● ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజ్ఞప్తి

గుంటూరు సిటీ, మార్చి 21: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలో ఉన్న మహిళలు (గర్భిణులు, బాలింతల) కోసం పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె గురువారం ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్ కమిషన్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలకు వేరుగా క్యూలైన్ లు ఏర్పాటు చేయాలని లేఖలో పేర్కొన్నారు. కొన్ని అత్యవసర సందర్భాల్లో మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు, తదితర విషయాల్లో వారికి తగు న్యాయం చేయడం కోసం బాధితులను పరామర్శించడానికి మహిళా కమిషన్ చైర్‌పర్సన్, మెంబర్లకు ఎన్నికల నిబంధనలలో సడలింపు ఇవ్వవలసినదిగా గజ్జల వెంకట లక్ష్మీ కోరారు.

విద్యుత్ బకాయి వసూళ్లపై దృష్టిసారిచండి

● అధికారులకు సీపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆదేశం

గుంటూరు, మార్చి 21: గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్‌లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని, వసూళ్ళపై సీరియస్‌గా దృష్టి సారించాలి అని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ కే.సంతోషరావు అధికారులకు సూచించారు. గుంటూరు విద్యుత్‌భవన్‌లోని సమావేశ హాల్లో గురువారం గుంటూరు, సీఆర్‌డిఏ సర్కిల్స్ డివిజన్, సబ్ డివిజనల్ అధికారులతో సీఎండీ సమీక్షా నిర్వహించారు. వినియోగదారులకు విద్యుత్ సేవలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, లేని పక్షంలో సంబంధిత అధికారులు తిరిగి వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొత్త సర్వీసుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పీక్ అవర్స్‌లో లోడ్ బ్యాలెన్స్ చేసుకోవాలని, అంతరాయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. వేసవిలో లోడ్‌ను దృష్టిలో పెట్టుకొని ట్రాన్స్‌ఫార్మర్స్‌ను అవసరానికి అనుగుణంగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డివిజన్ వారీగా పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా రెవెన్యూ వివరాలను సీఎండీ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీపీడీసీఎల్ డైరక్టర్స్ బీ.జయ భారతరావు(టెక్నికల్), టీ.వనజా(ప్రాజక్ట్స్), సీజీఎంలు ఏ.రామ్‌దాస్, కేఏస్.పరబ్రహ్మం, ఆపరేషన్ సర్కిల్స్ ఎస్ఈలు ఆవుల మురళీకృష్ణ యాదవ్(గుంటూరు), ప్రత్తిపాటి విజయ్‌కుమార్(సీఆర్‌డిఏ), ఎనర్జీ ఆడిట్ విజయకృష్ణ, డివిజనల్ అధికారులు, ఏడీఈలు పాల్గొన్నారు.

అరుణాచలంనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, మార్చి 21: ఈనెల 25న పౌర్ణమికి అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తులకోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 23న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 24వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదేరోజు రాత్రి అక్కడే బసచేసి 25న పౌర్ణమిన అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదేరోజుసాయంత్రం బయల్దేరి 26న ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్ రిజర్వేషన్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జీ రూ. 2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 సంప్రదించాలని కోరారు.

అట్రాసిటీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి



పెమ్మసానికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ ధర్మారావు

తెనాలి రూరల్, మార్చి 21: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును వైసీపీ ప్రభుత్వం నీరుగారుస్తుందని, అట్రాసిటీ కేసు నమోదుచేసిన వెంటనే స్టేషన్ బైయిల్‌పై నిందితులను విడుదలచేస్తూ తమకు రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. గురువారం మండలంలోని హాఫ్‌పేటలో ఎన్నికలప్రచారంలో భాగంగా పర్యటిస్తున్న గుంటూరు పార్లమెంటరీ నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్‌ను, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌ను, తెనాలి టీడీపీ ఇన్‌చార్జి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసిన ధర్మారావు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్‌ను అమలు చేయాలని, ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేలా కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకునేందుకు తమవంతు కృషి చేస్తామని ధర్మారావు మాదిగ వారికి తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1,04,332 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,06,381 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,04,332 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 81,360 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	9000	15000
273	12000	19000
341	9000	18500
4884	11500	13500
సూపర్ 10	11500	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22000
బ్యాడిగి	9500	19500
దేవనూరు డీలక్స్	9000	20000
తెల్లకాయలు	5000	12500



స్థానిక నేతలు, గ్రామస్థులతో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు

నదుల అనుసంధానంతో పల్నాడు సుభిక్షం

● టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు

కారంపూడి, మార్చి 21: కృష్ణ, గోదావరి, పెన్నా నదుల అనుసంధానమే తన లక్ష్యమని, నదుల అనుసంధానం జరిగితేనే తాగునీటి ఇబ్బందులు లేకుండా పల్నాడు ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని టీడీపీ, జనసేన, బీజేపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం కారంపూడిలో ఆయన పర్యటించి నేతలు, కార్యకర్తలు, ప్రజలతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2022లోనే పార్లమెంట్ సమావేశంలో దీనిపై బడ్జెట్ కేటాయించిందని, పనులు మాత్రం ప్రారంభం కాలేదని చెప్పారు. రానున్న ఐదేళ్లలో నదుల అనుసంధానంకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. ఇందుకోసం నిధులు మంజూరు చేయించామని, ప్రాజెక్ట్ ప్రారంభానికి నోచుకోలేదని చెప్పారు. ఇది పూర్తయితే మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి సమస్య ఉండదన్నారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘ నేతలతో సమావేశమయ్యారు. ఎస్సీ కాలనీలో పర్యటించి కాలనీ అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఆయన వెంట తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ జాస్తి గంగారావు, కొంగర లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఉన్నం శ్రీను, ఉప ఎంపీపీలు పంగులూరి పుల్లయ్య, చావా వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జాని, తెలుగు యువత మండల అధ్యక్షుడు చిన రత్తయ్య, బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, దోర్నాల బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి, నాగవరపు రాముడు, జనసేన మండల అధ్యక్షుడు కేసనపల్లి కృష్ణబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పువ్వాడ శ్రీనివాస్, కర్ల అమరసైదయ్య తదితరులు ఉన్నారు.



సమావేశానికి హాజరైన సమన్వయ కమిటీ సభ్యులతో డాక్టర్ బీ.లక్ష్మి

పరిశోధనలతో రైతులకు మేలు

● వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ బీ.లక్ష్మి

బాపట్ల, మార్చి21: ఏరువాక కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు సమన్వయ కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని లాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ బీ.లక్ష్మి తెలిపారు. బాపట్ల ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. బాపట్ల ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బాలమురళీధర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరిశోధన అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అందువలనే కొత్తరకాలు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నాయని రైతులు ముందస్తు ప్రణాళికతో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం రైతులు, శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణా విభాగాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ ఎంసీ ఓబయ్య, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.వి.రమణ, డీఆర్‌సీ డీటీసీ డాక్టర్ ఎం.విజయనిర్మల, బాపట్ల పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.హనుమంతరావు, మత్స్యశాఖ జేడీ డాక్టర్ పి.సురేష్, జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ టి.రత్నకుమారి, బాపట్లలోని వ్యవసాయ కేంద్రాల వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరై అపరాల సేద్యం, సేంద్రియ వ్యవసాయం, కలుపునివారణ మందుల వాడకం, వివిధ ఆధునిక వ్యవసాయ పనిముట్ల వాడకం వంటి విషయాలపై సూచనలు, సలహాలిచ్చారు.

వైసీపీకి మదమంచి రాజీనామా

సత్తెనపల్లి, మార్చి 21: పార్టీ కోసం మూడున్నర ఎకరాలు పొలం అమ్ముకున్నా వైసీపీలో సరైన ప్రాధాన్యం లేక పోవటంతో ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు వైసీపీ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల పార్టీ మాజీ కన్వీనర్ మందమంచి రాంబాబు తెలిపారు. గురువారం సత్తెనపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఏర్పాటు చేసినప్పటి నుంచి పార్టీ కోసం ఎంతో త్యాగం చేసినట్టు ఆయన తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ స్థానిక నాయకత్వం సరైన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు పార్టీలో కొనసాగానన్నారు. పదవివున్నప్పటికీ సామాన్య కార్యకర్తగానే కొనసాగానన్నారు. గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ పదవులను వైసీపీ తరఫున ఏకగ్రీవంగా గెలిపించుకున్నప్పటికీ స్థానిక నాయకత్వం గ్రామాభివృద్ధికి ఎటువంటి సహకారం అందించ లేదన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన తాను కట్టావారిపాలెం సర్పంచ్ అయిన మదమంచి పార్వతి కుమారి, గ్రామ ఎంపీటీసీ, తన సోదరి దేవినేని అనురాధలు కూడా పార్టీకి రాజీనామా చేసినట్టు మందమంచి రాంబాబు తెలిపారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

మా ఊపిరి అమరావతి

● 1556వ రోజుకు రైతుల ఆందోళన

తుళ్ళూరు, మార్చి 21: అమరావతిని కాదని రాష్ట్రాభివృద్ధిని సీఎం జగన్‌రెడ్డి అడ్డుకున్నాడని 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1556వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతి తమ ఊపిరి అని పేర్కొన్నారు. మూడు రాజధానులని అమరావతి నిర్వీర్యం చేసి, అభివృద్ధి లేకుండా వినాశనం చేశారన్నారు. ప్రాంతాల మధ్య తారతమ్యం తీసుకొచ్చి మూడు ముక్కల ఆటతో రాష్ట్రాభివృద్ధి లేకుండా చేశారన్నారు. పరిశ్రమలు పారిపోయేటట్టు చేసి ఉద్యోగావకాశాలు లేకుండా నిరుద్యోగం పెంచాడన్నారన్నారు. ఎడారి శ్మశానం, అడవి అంటూ అమరావతిపై అభాండాలు వేయటం దుర్మార్గమన్నారు. సీఎం జగన్‌రెడ్డి పదవి నుంచి దిగిపోయే ముందు అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. అమరావతివెలుగు కార్యక్రమం కొనసాగింది, రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన కర్లపాలెం వైసీపీ నాయకులు, కార్యకర్తలు

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కర్లపాలెం, మార్చి 21 : కర్లపాలెం గ్రామానికి చెందిన 20మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు, 9వ వార్డు మెంబర్ కొండమూది పద్మావతి ఆధ్వర్యంలో గురువారం తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ చేతుల మీదగా పార్టీ కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరినవారిలో పేర్లి వంశీ, పేర్ల సునీల్, కొండమూది చంటి, కొండమూది నాగేశ్వరరావు, కొండమూది టీవీ రా వు, షేక్ షఫీ, సలగల రావు, బెజ్జం సునీల్, బెజ్జం సుదర్శనచంద్, చిలకమ్మ, షేక్ కాలేషా, నాగలక్ష్మి, యేసుబాబు, గాయత్రి, మాధవి, కొండముది అను, సుబ్బారెడ్డి, సలగల సూరజ్, మాణిక్యరావు తదితరులున్నారు. అదేవిధంగా ఆరుగురు నూతన ఓటర్లు వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

ముందస్తుగా అనుమతులు తీసుకోవాలి

● ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఏదైనా రాజకీయ పార్టీగాని, అభ్యర్థిగాని సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలంటే నిబంధనల ప్రకారం ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ రాజకీయ పక్షాలను కోరారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు గురించి గురువారం ఆయన ఓ ప్రకటనలో వివరించారు. ర్యాలీలు నిర్వహించేటప్పుడు ప్రారంభ సమయంతో పాటు ప్రదేశం, వెళ్లే మార్గం ముందుగానే నిర్ణయించుకుని దానికి అనుగుణంగా అనుమతులు పొందాలని ఎస్పీ తెలిపారు. విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఎవరైనా చేస్తే చర్యలుంటాయన్నారు. ఎన్నికల ప్రచారం కోసం మసీదులు, చర్చిలు, దేవాలయాలు మరే ఇతర ఆరాధనా ప్రదేశాలను, పాఠశాలలను ఉపయోగించకూడదని తెలిపారు. అనుమతులు లేకుండా లౌడ్ స్పీకర్లను ఉపయోగించరాదన్నారు. ప్రజలంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిర్భయంగా తమ ఓటు హక్కును ప్రజాస్వామ్యయుతంగా వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించాలి



ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారన్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ శ్రేణులు

రేపల్లె, మార్చి 21: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం తమ గ్రామస్థులకు కల్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలాషారన్‌కు టీడీపీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అందజేసిన వినతిపత్రంలో నిజాంపట్నం మండల పరిషత్ అధ్యక్షురాలు మోపిదేవి విజయనిర్మల భర్త వెంకట హరనాద్ తన అనుచరులతో గ్రామంలో గూండాయిజం చెలాయిస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. 2019 ఎన్నికల సమయంలో కూడా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఈ సమయంలో మైనార్టీకి చెందిన గ్రామస్థుడిపై హత్యా ప్రయత్నం చేశారన్నారు. బుధవారం మా గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ శ్రీనివాసరావుపై దాడి చేశారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, టీడీపీ నాయకులు బి.రామకృష్ణ, లీగల్ సెల్ అధ్యక్షుడు వై ధర్మతేజ, సీత సాయిబాబు, నర్రా వెంకటేశ్వరరావు, కె.ఫారూఖ్‌జానీ, నాయుడు గోపీ, తదితరులున్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థిని కొట్టి గాయపరిచిన అధ్యాపకుడు

● పోలీసులకు ఫిర్యాదు.. అధ్యాపకుడు సస్పెన్షన్



బాపట్ల ఏరియా వైద్యశాలలో ఎక్స్‌రే తీయించుకుంటున్న విద్యార్థి నవదీప్‌కుమార్

బాపట్ల, మార్చి 21 : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో సెకండ్‌షిప్ పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బొనిగల నవదీప్‌కుమార్‌ను డ్రాయింగ్ అధ్యాపకుడు కొత్తమాసు బాలాజీ తీవ్రంగా కొట్టడం కలకలం రేపింది. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అధ్యాపకుడు ఈ విధంగా చేయటంపై దళిత సంఘా లు భగ్గుమన్నాయి. బుధవారం కళాశాలకు వెళ్లిన విద్యార్థి నవదీప్‌కుమార్‌ను రూమ్‌లోకి పిలిపించి సిగరెట్‌లు తాగుతున్నావంటూ తలుపులు వేసి తీవ్రంగా కొట్టాడని విద్యార్థి తెలిపారు. గాయాలతో ఇంటికెళ్లి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు తెలియజేయటతో రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందుతూ బాధిత విద్యార్థి స్టేట్‌మెం ట్ ఇచ్చాడు. బాధిత కుటుంబాన్ని దళిత సంఘాల నాయకులు పరామర్శించి కారకుడైన అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధ్యాపకు ల సమక్షంలో నిర్బంధించి విచక్షణా రహితంగా కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన చేపడుతామని దళితనాయకులు పర్రె కోటయ్య, సలగల సురేష్, కాగిత కోటేశ్వరరావు, మార్పు ధీనరాజులు డిమాండ్ చేశారు. కాగా ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్‌ను వివరణ కోరగా విద్యార్థిని కొట్టిన అధ్యాపకుడు కొత్తమాసు బాలాజిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడుతామన్నారు. విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చే సందర్భంలో అధ్యాపకుడు విచక్షణ కోల్పోయి దుర్భాషలాడుతూ చేయిచేసుకున్నాడన్నాడు. కావున సదరు అధ్యాపకుడిపై చర్యలు తీసుకొని బాధిత విద్యార్థిని ఆస్పత్రిలో పరామర్శించి న్యాయం చేస్తామని హామీనిచ్చినట్లు తెలిపా రు.

వాహనాలను తనిఖీ చేసిన చందోలు పోలీసులు

పిట్టలవానిపాలెం, మార్చి21 : సాధారణ ఎన్నికల్లో భాగంగా బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ ఆధ్వర్యంలో చందోలు ఎస్ఐ టి.అనీల్‌కుమార్ తన సిబ్బందితో కలిసి తనిఖీ నిమిత్తం సంగుపాలెం కోడూరు శివారులో నూతనంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎస్ఐ టి.అనీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మండల శివారు ప్రాంతంలో ఈ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. మద్యం, డబ్బులు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసకుంటామన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు



చెన్నకేశవస్వామి

పిట్టలవానిపాలెం, మార్చి 21: ఆధ్యాత్మిక చింతనకు భక్తి భావనకు ఆలంబనగా నిలిచిన చందోలు గ్రామంలో ఉన్న సనాతమైన చెన్నకేశవస్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 10గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారిని పెండ్లికుమారుడిగా అలంకరించారు. రాత్రి 7.30 నిమిషాలకు కోదండరామభజన సమాజం చందోలు వారిచే భక్తులకు భజన కాలక్షేపం నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఈనెల 27వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

పది ఎకరాల గడ్డివామి దగ్ధం

రేపల్లె, మార్చి 21: మండలంలోని శింగుపాలెం గ్రామంలో సము ద్రాల నరసింహారావుకు చెందిన పదెకరాల గడ్డివామి నిప్పంటుకుని కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. చుట్టు పక్కల ఉన్న గృహాలకు ఎలాంటి ప్రమాదం సంభవించకుండా మంటలను అదుపు చేశారు. లక్ష రూపాయలు పైనే ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు.

పూరిల్లు దగ్ధం

అమృతలూరు, మార్చి 21: అమృతలూరులో ప్రమాదవశాత్తు పూరిళ్ల దగ్ధమైన ఘటన గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాచకొండ నారాయణ దంపతులు గ్రామానికి చెందిన దొడ్డపనేని రాధాకృష్ణమూర్తికి చెందిన పూరి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఆ వృద్ధ దంపతులు ఇంటిలో లేని సమయంలో ఒక్కసారిగా మంటలు వచ్చాయి.

భట్టిప్రోలులో అధ్వాన పారిశుధ్యం

● రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

భట్టిప్రోలు, మార్చి 21 : పంచాయతీ అధికారుల అలసత్వం అస్తవ్యస్త డ్రైనేజి వ్యవస్థ కారణంగా భట్టిప్రోలులో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. మురుగు కాలువల్లో పారుదల కావాల్సిన నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో దోమలు విజృంభిస్తూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఒక పక్క ముందుకు కదలని మురుగుతో భరించలేని దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. 16 వార్డులు కలిగిన మేజర్ పంచాయతీ భట్టిప్రోలులో సుమారు 18 వేల జనాభా నివాసం ఉంటున్నారు. మేజర్ పంచాయతీకి ఆదాయం ఘనంగా ఉన్నప్పటికీ పారిశుధ్య నిర్వహణలో మాత్రం వెనుకంజలో ఉంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన డ్రెయినేజీ వ్యవస్థ నిరుపయోగంగా మారడం వల్ల ఎక్కడి మురుగు అక్కడే నిలిచి ఉండడంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. మెయిన్‌రోడ్డు, కొత్తపేటలతో పాటుగా దళితవాడల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మించాల్సిన డ్రెయినేజి వ్యవస్థ గుత్తేదారుల స్వార్థం కారణంగా అలంకార ప్రాయంగా మారి ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారిపోయిందని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

ఇదిలా ఉంటే డ్రెయినేజీల నిర్వహణలో పంచాయతీ అధికారుల వైఫల్యం గ్రామ ప్రజల పాలిట శాపంలా మారింది. కొన్ని వార్డుల్లో రంగు మారిన మురుగునీటిలోనే తాగునీటి కుళాయిలు ఉన్నాయని దుర్వాసన వస్తున్న చోటే తాగునీటిని పట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మేజర్ పంచాయతీ భట్టిప్రోలులో పూర్తి స్థాయిలో డ్రెయినేజీలో పూడికతీత పనులు నిర్వహించి మురుగుపారుదలయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మెయిన్‌రోడ్డులో స్థానిక చేనేత సొసైటీ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



కొత్తపేటలో సిమెంటు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

జర్నలిస్టులపై వైసీపీ గూండాల దాడులు హేయం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల

భట్టిప్రోలు, మార్చి 21 : అధికారాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీ రౌడీ మూకలు జర్నలిస్టులపై దాడులకు దిగడం హేయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ 5 సంవత్సరాల పాలనలో సామాన్య ప్రజానీకం, టీడీపీ సానుభూతిపరులు, దళితులు, విలేకరులపై దాడులు పెరిగిపోయాయన్నారు. అధికారం ఉంది కదా అని ఎలా పడితే అలా అనుచితంగా ప్రవర్తిస్తే సరిపోతుందా అని అన్నారు. వైసీపీ తరపున నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్‌బాబు ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ తహసీల్దార్ కార్యాలయానికి తన అనుచరులతో రావడం ఏంటని ప్రశ్నించారు. సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న ఆంధ్రజ్యోతి విలేకరి ఫోటోలు తీస్తుండగా అశోక్‌బాబు వ్యంగ్యంగా మాట్లాడుతూ విలేకరినే వీడియోలు తీయడం హాస్యాస్పదమన్నారు. ఇలాంటి వ్యక్తులు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వేమూరు నుంచి పోటీ చేయడం సిగ్గుగా ఉందన్నారు. ఇసుక ట్రాక్టర్లను విడిపించడానికి తహసీల్దార్ కార్యాలయానికి ఏ అధికారంతో వచ్చావు అక్కడ ఉన్న అధికారులు, విలేకరిపై అనుచితంగా ప్రవర్తించడం మీ నైజాన్ని బహిర్గతం చేసిందని ఆయన తెలియజేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న విలేకర్లపై దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో సమాజంలో జరుగుతున్న సంఘటనలను బహిర్గతం చేసే హక్కు జర్నలిస్టులకు ఉందన్నారు. ఇటీవల పల్నాడు జిల్లాలో మైనింగ్ దోపిడీని ప్రశ్నించినందుకు వైసీపీ గూండాలు విలేకరిపై హత్యాయత్నం చేశారన్నారు. విలేకరిపై దాడికి యత్నించిన బాధ్యులపై విచారించి చర్యలు తీసుకోవాలని సాయిబాబా డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జిలు ధరించి నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనపర్తి సుందరరావు, బట్టు మల్లికార్జునరావు, యర్రంశెట్టి కర్ల శ్రీనివాసరావు, యడ్ల జయశీలరావు, జంగం శ్యాంసన్, ఇబ్రహీంబేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల విద్యార్థులకు గేట్ ర్యాంకులు

బాపట్ల, మార్చి 21 : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల డాక్టర్ ఎన్టీఆర్ ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాల విద్యార్థులు ఫుడ్ టెక్నాలజి విభాగంలో గేట్ ర్యాంక్‌లు సాధించారు. ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్ ఏడుకొండలు అభినందించారు. గేట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించటం ద్వారా ర్యాంకింగ్ ఫలితాలను బట్టి ఐఐటీ, ఎన్ఐటీ, నిఫ్టెమ్‌లాంటి పేరుమోసిన విద్యా సంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించటానికి దోహదపడుతుందని ఆయన తెలిపారు. కళాశాలకు చెందిన జి.సుమంత్ 3698 ర్యాంక్, టి.శ్రీనివాస్ 3838 ర్యాంక్, హెచ్ కశ్యప్‌దొర 6582 ర్యాంక్, పి.భాను ప్రత్యూష 7361 ర్యాంక్ బి.లహరి 9744 ర్యాంక్‌లు సాధించారన్నారు. తమ కళాశాల విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ర్యాంకులు సాధించడంపై అసోసియేట్ డీన్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

బాపట్ల, మార్చి 21: గ్రామీణ మహిళల కుటుంబ ఆర్థిక సుస్థిరత, నైపుణ్యంతో కూడిన ఉపాధి కల్పన ద్వారా సాధ్యమౌతుందని ఎస్‌టూనీడి ఫౌండేషన్ కార్యనిర్వాహకురాలు తోట రమ్యపావని తెలిపారు. పట్టణంలోని విజయలక్ష్మీపురంలో కుట్టుశిక్షణ పొందిన ఇద్దరు మహిళలకు గురువారం ఉచితంగా కుట్టుమిషన్‌లను ఫౌండేషన్ ద్వారా ఆమె అందజేశారు. వీటిని ఉపయోగించుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని ఆమె కోరారు. 25 సంవత్సరాల అనుభవం ఉన్న కుండేటి శివకుమారి, మద్దిబోయన స్వప్న, శిక్షణలో నేర్చుకున్న పులి మరియమ్మ, ఐనవోలు సత్యవతికి కుట్టుమిషన్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఫౌండేషన్ డైరెక్టర్ తోట సురేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉండవల్లి శ్రీదేవిని కలిసిన ఉపసర్పంచ్

కర్లపాలెం, మార్చి 21 : కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా గురువారం తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఖాజామొహిద్దీన్, షేక్.హబీబ్, షేక్.రషీద్, ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని కలిసిన కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా

అగ్నిబాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ కిట్‌ల పంపిణీ

బాపట్ల, మార్చి 21 : మండలంలోని మరుప్రోలువారిపాలెం గ్రామంలో సంభవించిన అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన మున్నం చినకొండలురెడ్డి కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు ఆధ్వర్యంలో గురువారం కిట్‌లు పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ఈ విధంగా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విపత్తుల నిర్వాహణ సభ్యులు డివి.రమణబాబు తదితరులు పాల్గొని కిచెన్‌సెట్, హైజిన్‌కిట్, టార్పాలిన్ సీటును అందజేశారు.

పెదపూడి జడ్పీ హైస్కూల్లో కంటి పరీక్షలు

అమృతలూరు, మార్చి 21: మండలంలోని పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు గురువారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అమృతలూరుకు చెందిన మైనేని రత్నాకర్ చౌదరి జ్ఞాపకార్థం కుమారుడు ఎన్నారై శ్రీహర్ష ఆర్థిక సహకారంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల సౌజన్యంతో నిర్వహించిన వైద్యశిబిరంలో పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు జరిపారు. మైనేని రత్నప్రసాద్, మోర్ల ముసలయ్య, సత్యనారాయణ, హెచ్ఎం రంగారావు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి వార్షిక వేడుకలు

చెరుకుపల్లి, మార్చి 21: మండల ంలోని గూడవల్లి గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ వార్షిక వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 26వ తేదీ వరకు వార్షిక వేడుకలను నిర్వహిస్తారు. గురువారం గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారి జంజనం సాంబశివరావు, భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● ఎంపీడీవో శేషగిరిరావు

వేమూరు, మార్చి 21: ప్రతి మహిళ మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా ఆడపిల్లలకు భద్రతాభావం కల్పించే విధంగా కృషి చేయాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. వేమూరు రోశయ్య మీటింగ్ హాల్లో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సీడీపీవో విజయలక్ష్మి అధ్యక్షతన అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, పలు శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులకు వివిధ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీవో మాట్లాడుతూ బాల్యవివాహాల ద్వారా కలిగే ఇబ్బందులను తెలియజేస్తూ ఈ చర్య చట్ట విరుద్ధమన్నారు. మహిళా హక్కు చట్టాలు వివరించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వెంకట సురేష్‌బాబు మాట్లాడుతూ వివిధ చట్టాన్ని గురించి అవగాహన కల్పించారు. సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీల బాధ్యతలు, విధి విధానాలను వివరించారు. మహిళలకు, చిన్నారులకు సంబంధించిన ప్రభుత్వ పథకాలను అర్హులైన అందరికీ అమలు చేసే విషయంలో చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. సదస్సులో సహాయక సీడీపీవో విజయరాణి, విద్యాశాఖ అధికారి రోస్ ల్యాండ్, ఏరియా సూపర్‌వైజర్లు సదస్సులో మాట్లాడారు. 17 గ్రామాలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు.

విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

● ఆయుష్‌శాఖ అధికారి శిరీష

వేమూరు, మార్చి 21 : విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని అందుకు అనుగుణంగా ఆహార పదార్థాలను స్వీకరిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ ఆయుష్‌శాఖ ఆయుర్వేద విభాగం అధికారిని డాక్టర్ శిరీష సూచించారు. మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద శిబిరం ఏర్పాటుతో పాటు ఆరోగ్య సూత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రధాన ఉపాధ్యాయులు నరసింహాస్వామి అధ్యక్షత వహించారు. సదస్సులో శిరీష మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటేనే విద్య విషయంలో ఉన్నతమైన స్థితికి వెళ్లగలుగుతారన్నారు. కొల్లూరు మండలం కడప వైద్యశాల అధికారిడాక్టర్ నాగసుధ మాట్లాడుతూ ప్రభుత్వం పోషణ అభియాన్ పోషణ పక్వాడ పథకాల ద్వారా ప్రజలకు వైద్యసేవలను మరింత దగ్గర చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా 360మంది విద్యార్థులకు 20మంది ఉపాధ్యాయులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పేద విద్యార్థులకు నగదు బహుమతి

పిట్టలవానిపాలెం, మార్చి 21: మండలంలోని ఖాజీపాలెం కేవీఅ రేకేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల, డాక్టర్ డీఎస్ రాజు జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతిభగల పేదవిద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన దక్కన్ ఫైన్ కెమికల్స్ వారి సౌజన్యంతో ఈనెల 23వ తేదీన ఉదయం 10గంటలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కళావేదిక నందు నగదు బహుమతి ప్రధానోత్స వం జరుగుతుందని ఆయా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, బీహెచ్ సుబ్బరాజులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గడ్డిపాటి అనీల్‌కుమార్ ముఖ్యఅతిథు లుగా పాల్గొంటారని అదేవిధంగా పిట్టలవానిపాలెం తహసీల్దార్ కె.స్వార్తి విశిష్ట అతిథులుగా తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలియజేశారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

బాపట్ల, మార్చి 21 : బాపట్ల పట్టణంలోని ప్యాడిసన్‌పేట, జగనన్న కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. కారు నడుపుతున్న యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఏవిధమైన ఫిర్యాదు అందలేదు.

వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ మ్యాచ్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న వేగేశవ

బాపట్ల, మార్చి 21 : వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేగేశన అభిమానులు క్రికెట్ ఆటను గురువారం ఏర్పాటు చేశారు. వేగేశన ఫౌండేషన్ చైర్మన్ వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర, రాఘవేంద్ర, యశ్వంత్, నవీన్, గోపి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు డిగ్రీ కళాశాల 43వ వార్షికోత్సవం

పిట్టలవానిపాలెం, మార్చి 21 : మండలంలోని ఖాజీపాలెం కేవీఅ రేకేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 23 కేవీఅ రేకేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల 43వ వార్షికోత్సవం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్ తెలిపారు.

పార్టీ కార్యాలయంలో ఫ్లెక్సీల తొలగింపు

● అధికారులను అడ్డుకున్న టీడీపీ నాయకులు
● అనుమతి ఉన్నా అత్యుత్సాహం



టీడీపీ కార్యాలయం ఫ్లెక్సీలను తొలగిస్తుంటే అడ్డుకున్న టీడీపీ నాయకులు

రేపల్లె, మార్చి 21: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో పార్టీ కార్యాలయంలో ఉన్న టీడీపీ నాయకులు ఫ్లెక్సీలను తొలగించటానికి వీల్లేదం టూ మున్సిపల్ కార్యాలయానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నామని అధికారులకు తెలిపారు. మున్సిపల్ అధికారులు మాత్రం టీడీపీ కార్యాలయంలో ప్రధాన ఫ్లెక్సీపై వేరే ఫ్లెక్సీ తీసుకు వచ్చి పైన కప్పివేశారు. పార్టీ కార్యాలయానికి వెళ్లే ముఖద్వారం ఫ్లెక్సీలను తొలగించాలంటూ మున్సిపల్ సిబ్బంది హడావిడి చేశారు. దీంతో టీడీపీ నాయకులు వైసీపీ కార్యాలయాల్లో తొలగించారా? పట్టణంలో వైసీపీ బోర్డులు తొలగించిన దాఖలాలు లేవని, కేవలం టీడీపీకి చెందిన వారిపైనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీ కార్యాలయంలో కూడా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం ఏమిటంటూ మున్సిప ల్ అధికారులను నిలదీయడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. అధికారు లు మాత్రం ఎన్నికల నిబంధనలను పాటించాలే తప్పా వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించరాదని టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, వడ్డి లక్ష్మోజీ, బొర్రా సూర్యరాజు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాసంశెట్టి మహేష్‌లు కోరారు.

తండ్రి గెలుపు కోసం తనయుడి ప్రచారం



మండలంలోని రాచూరులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు తనయుడు అఖిలేష్

భట్టిప్రోలు, మార్చి 21: తండ్రి గెలుపు కోసం తనయుడు నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాడు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు నక్కా అఖిలేష్ మండలంలోని రాచూరు గ్రామంలో గురువారం జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను సమగ్రంగా ప్రజలకు వివరిస్తున్నా రు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఆనందబాబుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు రాయనప్రసాద్, వేజళ్ళ సతీష్, చిలకా పాములు, నాంచారయ్య అంజిబాబు, ఆనంద్ కిషోర్, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆనందబాబు విజయం కోరుతూ ప్రచారం



తోకలవానిపాలెంలో ఆనందబాబు తరఫున ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

కొల్లూరు, మార్చి 21: టీడీపీ, జనసేన, బీజేపీ వేమూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబును గెలిపించాలని కోరుతూ పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని తోకలవానిపాలెంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి బాబు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ తమ అభ్యర్థి ఆనందబాబును ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని విధాల రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఈ ఐదేళ్ళ వైసీపీ పాలనలో మచ్చుకైనా అభివృద్ధి అనేది కనిపించలేదని ఓటర్లు గుర్తించి తమ ఓటును ఉమ్మడి అభ్యర్థికి వేయాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మైమురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, పార్టీ నాయకులు యలవర్తి కోటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, మద్దాల శ్యామ్, కొల్లి శివరామకృష్ణప్రసాద్, సుంకర రమేష్, కొల్లి ప్రసాద్, కాంతారావు, దివి సీతారామయ్య, రావుల రమేష్, ఈడ్పుగంటి బుజ్జి, గుమ్మడి సాంబశివరావు, కోగంటి శివవెంకటేశ్వరరావు, జీఎల్‌జీ భగవాన్, సుంకర కోటేశ్వరరావు, కొల్లి భాస్కరరావు, సుంకర నాగేశ్వరరావు, దూళిపూడి కృష్ణ, దొడ్డపనేని వెంకటేశ్వరరావు, సుంకర ప్రసాద్, కొల్లి సాయిబాబు, వేములపల్లి మోహన్‌కృష్ణ, ఆలూరి సుందరరావు, కొమ్ము తులామాన్, మున్నంగి విజయ్, బుర్రి జగన్, మోర్ల వెంకటేశ్వరరావు, తోట సాంబయ్య, కుడితిపూడి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

పెరవలిపాలెంలో టీడీపీ ఎన్నికల ప్రచారం



పెరవలిపాలెంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

అమర్తలూరు, మార్చి 21 : మండలంలోని పెరవలిపాలెం గ్రామంలో గురువారం రాత్రి టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల గురించి ఓటర్లకు వివరిస్తూ కరపత్రాలను పంపి ణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు సింగంశెట్టి శివకామేశ్వరరావు, బూత్ ఇన్‌చార్జి లీలా కృష్ణమూర్తి, బీసీ సంఘం నాయకులు పులివర్తి చిరంజీవి, ఎస్సీ సంఘం నాయకులు పులి పాపారావు తదితరులు పాల్గొన్నారు. ఆనందబాబు విజయాన్ని కోరుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు

● అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

రేపల్లె, మార్చి 21: ఎన్నికల నిబంధనలు వివిధ పార్టీల అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హేలా సోరాన్ అన్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లో ఉన్న సందర్భంగా పొలిటికల్ పార్టీలు వారు తీసుకోవాల్సిన పర్మిషన్లపై రాజకీ య పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏ కార్యక్రమం చేసిన సభలు సమావేశాలు నిర్వహించినా తప్పనిసరిగా ఎన్నికల అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల ని సూచించారు. లేని ఎడల చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన బొడ్డువానిపాలెం సర్పంచ్ నేరెళ్ళ సుబ్బయ్య, తదితరులు

టీడీపీలో చేరిన బొడ్డువానిపాలెం సర్పంచ్

మేదరమెట్ల , మార్చి 21: మండలంలోని బొడ్డువానిపాలెం సర్పంచ్ నేరెళ్ల సుబ్బయ్య మాజీ సర్పంచ్ ఆరుమళ్ల సంతోషం, వార్డు సభ్యులు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. గురువారం రాత్రి బొడ్డువానిపాలెం సర్పంచ్ నేరెళ్ల సుబ్బయ్యతోపాటు గ్రామానికి చెందిన పలువురు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ఐదేళ్లుగా రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదన్నారు. దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా జగన్ పాలన సాగిందన్నారు. ల్యాండ్, స్యాండ్, వైన్, మైన్ అన్నింటిలో దోపిడీకి పాల్పడి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అక్రమంగా సంపాదించిన సొమ్ముతో ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారన్నారు. వైసీపీ ఈసారి అధికారంలోకి వస్తే ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులు దోచుకుంటారన్నారు.

సుబ్బయ్యతో పాటు తిరుపలశెట్టి నాగేశ్వరరావు, వార్డు సభ్యులు గుమ్మడిల్లి బ్రహ్మయ్య, కొండ్రు రజిత, పూరిమిట్ల సుబాషిణీ, మానికొండ స్రవంతితో పాటు బొబ్బ శేషయ్య, అనీల్, గాజులవర్తి జక్రయ్య, పులి వెంకటసుబ్బయ్య, ప్రమీళ, కొండ్రు రాజారావు తదితరులు టీడీపీలో చేశారు.

రవికుమార్‌ను కలిసిన జనసేన నేతలు

బొడ్డువానిపాలెంకు చెందిన పలువురు జనసేన పార్టీ నేతలు జొన్నతాళిలో ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. రవికుమార్‌ను కలిసిన వారిలో నేరేళ్ల సురేష్, సిద్ధంశెట్టి అనిల్, చింతం మణి, నేరేళ్ళ సతీష్, సిద్ధంశెట్టి పవన్, చింతం శివ, దాసరి కృష్ణ, చింతం అవినాష్, చింతం దినేష్, చింతం రామయ్య, నేరేళ్ల మణి, వాసు, నాని, ఆలపాటి వెంకటేష్, నేరేళ్ళ రామానాయుడు, ఉమ్మిడిశెట్టి మస్తాన్ తదితరులు ఉన్నారు.

నకిలీ ఫాం-7లపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

బల్లికురవ, మార్చి 21: ఓటర్లు గ్రామాలలో ఉన్న తమ ఓట్లు తామే తీసి వేయాలని ఆన్‌లైన్‌లో ఫాం 7 దరఖాస్తుల కారకులపై వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సుభద్ర గురువారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బల్లికురవ మండలంలోని వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, వేమవరం, ఉప్పుమాగులూరు తదితర గ్రామాలలో 279 మంది తమ ఓట్లు తామే తొలగించాలని ఫోర్జరీ సంతకాలు చేసిన కొందరు ఫాం-7లను ఇటీవల ఆన్‌లైన్‌లో పెట్టారు. దీనిపై తహసీల్దార్ సుభద్ర వీఆర్వోలు, బీఎల్వోలచే విచారణ చేయించగా, 279 మంది ఓటర్లు తాము అసలు ఫాం 7 లు పెట్టలేదని ఎవరో కావాలనే పెట్టారని రాత పూర్వకంగా విచారణలో తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నకిలి ఫాం 7 దరఖాస్తులు చేసిన వారిపై చట్టపరంగా విచారణ జరిపి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ నాగశివారెడ్డికి ఫిర్యాదు చేశారు. టీడీపీ ఓటర్లే లక్ష్యంగా ఫాం 7లు పెట్టి తొలగించాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టినట్లు తెలుస్తుంది. అసలు ఓటర్లకు తెలియకుండా వారి సంతకాలను ఫోర్జరీ చేసి ఫాం7లు పెట్టటం మండలంలో చర్చనీయాంశంగా మారింది. పక్కాగా విచారణ జరిపితే ఇందుకు కారణమైన వారిని గుర్తించే అవకాశం ఉందని బాధిత ఓటర్లు అంటున్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

మార్టూరు, మార్చి 21: మండలంలోని రాజుపాలెం గ్రామంలో గత రెండు రోజుల నుంచి విద్యుత్ అధికారుల బృందం ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. అధిక బకాయిలు ఉన్న 30 సర్వీసుల గృహాలకు సంబందించి తనిఖీలు చేశారు. అదనంగా విద్యుత్ లోడు ఉన్న ముగ్గురికి ఫెనాల్టీ విధించారు. చిరువ్యాపారికి సర్వీసు మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో అతని వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు ఈ వినియోగదారునికి సంబంధించిన వివరాలను పంపిన తర్వాత ఫెనాల్టీ విధిస్తారని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

బోరు ఏర్పాటుపై వీఆర్వో విచారణ

అద్దంకిటౌన్, మార్చి 21: ఎన్నికల కోడ్ అమలులో ఉండగా లెక్కచేయకుండా ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణపురంలో నియోజకవర్గ వైసీపీ నాయకుల సాయంతో స్థానిక నాయకులు చర్చిలో బోరు తవ్వకంపై గురువారం వీఆర్వో విచారించారు. గ్రామంలోకి వచ్చి చర్చి ప్రాంగణంలో బోరు వేయడాన్ని ఫొటోలు తీసుకోవడంతో పాటు తన సొంత డబ్బులతో వేయించాననే వ్యక్తిని విచారించారు. అలాగే కాలనీలో మిగిలిన కుటుంబాల వారిని విచారించగా వైసీపీ నాయకులు చెబితేనే బోరు వేశారని తెలిపారు. నాలుగురోజుల క్రితం కాలనీలోకి వైసీపీ నాయకులు వచ్చి వెళ్లారని స్థానికులు తెలిపారు. ఈక్రమంలో బోరు వేయించానన్న వ్యక్తిని తహసీల్దార్ కార్యాలయానికి వీఆర్వో పిలిపించారు. అతని వద్ద రాతపూర్వకంగా తీసుకోవాలని తహసీల్దార్ చెప్పడంతో సదరు వ్యక్తిని కార్యాలయానికి పిలిపించినట్టు వీఆర్వో లక్ష్మయ్య తెలిపారు.

పలు గ్రామాల్లో మోడల్ కోడ్ అమలు పరిశీలన



నీలాయపాలెంలో మోడల్ కోడ్ అమలను పరిశీలిస్తున్న ఎంపీడీవో వరప్రసాద్

చిన గంజాం, మార్చి 21: మండలంలోని నీలాయపాలెం, పల్లెపాలెం, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధి లోని బుచ్చిగుంట, కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం, రామచంద్రానగర్ తదితర గ్రామాల్లో మోడల్ కోడ్ అమలును ఎంపీడీవో వరప్రసాద్ గురువారం పరిశీలించారు. గ్రామాల్లోని బహిరంగప్రదేశాల్లో ఏర్పాటుచేసిన పార్టీల జెండాలను వెంటనే తొలగించాలని గ్రామపంచాయతీ కార్యద ర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల గ్రామ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చినగంజాం, మార్చి 21: మండల పరిధిలోని చినగంజాం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్య ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద గురువారం ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి వాహనాన్ని పరిశీలించినట్టు ఎస్ఐ చెప్పారు. అక్రమ మద్యం, నగదు, బంగారం లాంటివి వాహనాల్లో తరలించకుండా నిరోధించ డానికే చెక్‌పోస్టు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించ తర్వాతనే పంపాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

ప్రజలను వేధిస్తున్న తాగునీటి కష్టాలు



నీరులేక అడుగంటిన కారంచేడు కొమ్మమూరు కాలువ

కారంచేడు(పర్చూరు), మార్చి 21: తాగునీటి కష్టాలు ప్రజలను వెంటాడుతున్నాయి. చెరువులు, వాగులు అడుగంటడం, ఉన్న అరకొర నీరు కాస్త కలుషితంగా మారటంతో సమస్య జటిలంగా మారింది. గ్రామాల్లో ఎక్కడ చూచినా అడుగంటిన చెరువులు, కుంటలే దర్శనమిస్తున్నాయి. మరోపక్క రోజు రోజుకు పెరుగుతున్న ఎండలతో ఉన్న కాస్త నీరు అడుగంటుతుండటంతో ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే అనేక గ్రామాల్లో మూడు రోజులకు ఒకసారి పంచాయతీ కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో చాలీచాలని నీటితోనే ప్రజలు కాలం వెల్లబుచ్చుకుంటున్నారు. మండల కేంద్రమైన కారంచేడులో సమస్య జటిలంగా మారింది. మూడు రోజులకు ఒక సారి వాడుక నీటిని సరఫరా చేస్తుండటంతో పశులకు సైతం నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి ఆర్వో ప్లాంట్‌ల ద్వారా వచ్చిన నీటిని కొనుగోలు చేసుకొని మంచినీటిగా వినియోగించుకుంటున్నారు. గత్యంతరం లేని వారు చెరువుల ద్వారా పంచాయతీ సరఫరా చేస్తున్న నీటితోనే కాలం వెల్లబుచ్చుతున్నారు. దీనికితోడు కారంచేడు గ్రామంలోని కొమ్మమూరు కాలువ సైతం చుక్కనీరు కూడా లేక అడుగంటింది. దీంతో భవిష్యత్‌లో నీటి ఎద్దడి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సిద్ధం ఫ్లెక్సీలకు నిబంధనలు వర్తించవా!

» వల్లాపల్లి కాలనీలో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న వైనం

» ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టించుకోని అధికారులు



వల్లాపల్లిలో విద్యుత్ స్తంభాలకు తొలగించకుండా ఉన్న సిద్ధం పోస్టర్లు

బల్లికురవ, మార్చి 21: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి నాలుగు రోజులు గడుస్తున్నా గ్రామాలలో మాత్రం రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను, జెండాలను మాత్రం అధికారులు తొలగించటం లేదు. ప్రతిపక్ష టీడీపీ జెండాలను మాత్రం ఆగమేఘాల మీద తొలగించటంతో పాటు సొంత గృహాలపై ఉన్నవాటిని సైతం పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి మరి తొలగిస్తున్నారు. వైసీపీ జెండాలను మాత్రం సరిగా తొలగించటం లేదని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. మండలంలోని వల్లాపల్లి ఎస్సీ కాలనీలో ఇటీవల వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను విద్యుత్ స్తంభాలకు పెట్టారు. అలాగే, పలుచోట్ల వైసీపీ జెండాలను కట్టారు. ఎన్నికల షెడ్యూల్ రాగానే అధికారుతు కట్టుదిట్టంగా ఎన్నికల నిబంధనలు అమలుచేయాలని గ్రామస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ వైసీపీకి చెందిన ఫ్లెక్సీలను తొలగించేందుకు అధికారులు వెనకడుగు వేస్తున్నారు. ఇవిచూసిన ప్రజలు సిద్ధం పోస్టర్లకు ఎన్నికల నిబంధనలు వర్తించవా అంటూ గుసగుసలాడుకొంటున్నారు. రెండురోజుల క్రితం వల్లాపల్లి గ్రామ సెంటర్‌లో ఉన్న టీడీపీ జెండాను అధికారులు తొలగింపజేశారు. గ్రామంలో ఉన్న అన్ని జెండాలను తీసివేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే, సామాజిక భవనం ప్రహరీ గోడకు అంటించిన పోస్టర్లను కూడా అలాగే ఉంచారని అంటున్నారు. అధికారులు వెంటనే ఎన్నికల నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, లేకుంటే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని టీడీపీ నేతలు అంటున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



రావినూతల టీడీపీ బూత్ ఇన్‌చార్జులు, కుటుంబ సారథులు, పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

మేదరమెట్ల, మార్చి 21: రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా తెలుగుదేశంపార్టీ, నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం పంగులూరు మండలం ముప్పవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొరిశపాడు మండలం కుర్రవానిపాలెం, కొరిశపాడు, దైవాలరావూరు, రాచపూడి, బొల్లవరప్పాడు, ప్రాసంగులపాడు, పమిడిపాడు, రావినూతల గ్రామాల పార్టీ బూత్ ఇన్‌చార్జ్‌లు, పేజీ నేస్తం సభ్యులు, కుటుంబ సారథులు, గ్రామ పార్టీ నాయకులతో రవికుమార్ సమీక్ష చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్‌త్ గ్యారెంటీ పేరుతో తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించి జనంలోకి తీసుకెళ్ళాలన్నారు. ఓటరు జాబితాలపై ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. జగన్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం లభించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో ఉచిత పథకాల పేరుతో పది రూపాయలు ఇస్తూ వంద రూపాయలు లాక్కుంటున్నారని ప్రజలకు తెలియజేయాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న, అన్నివర్గాల వారికి న్యాయం జరగాలన్న టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలిపించాలని దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు.



పంగులూరు: రవికుమార్‌కు సంఘీభావం తెలుపుతున్న కొండమంజులూరు నేతలు

తెలుగుదేశం సానుభూతి పరుడయిన వృద్ధుడిపై తనిఖీ పేరుతో పోలీస్‌అధికారి చేయి చేసుకోవడం అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. జగన్‌రెడ్డి భజన చేస్తున్న అధికారులు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కొరిశపాడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, పేజీ నేస్తం సభ్యులు పాల్గొన్నారు.

గొట్టిపాటికి సంఘీభావం

పంగులూరు, మార్చి 21: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు కొండమంజులూరుకు చెందిన వడ్డెర సామాజికవర్గానికి చెందిన పలువురు సంఘీభావం తెలిపారు. గురువారం చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో కొండమంజులూరుకు చెందిన వల్లెపు ఏడుకొండలు, పల్లపు కోటేశ్వరరావు, పల్లపు మోహనరావు, పల్లపు సుబ్బారావు, మన్నెం రాంబాబు, తన్నీరు నాగరాజులు రవికుమార్‌ను కలసి తమ మద్దతు తెలిపారు. వీరివెంట టీడీపీ నేతలు చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, బత్తుల వెంకటరావు, తదితరులు ఉన్నారు.

బల్లికురవ: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు సుజాతనగర్ కాలనీకి చెందిన యువకులు శ్రీరాం చిన్న, సురభి రామారావు, మేదర రాజేష్, రాచపూడి కిషోర్, మాసోగు దేవసహాయం గురువారం ఎమ్మెల్యే రవికుమార్‌ను చిలకలూరిపేటలోని ఆయన స్వగృహంలో కలిసి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి రాగానే కష్టపడిన వారికి న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రావులపల్లి గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

» వైసీపీ పాలనలో అక్రమ కేసులు

» పలువురు నేతల వెల్లడి



సమావేశంలో పాల్గొన్న బీసీ నేతలు

పర్చూరు, మార్చి 21: తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా బీసీలు ఐక్యం కావాలని నేతలు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బీసీలకు సముచిత స్థానం కల్పించారన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. బీసీల అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. గురువారం మార్టూరు మండలం ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి కార్యాలయంలో జయహో బీసీ సదస్సు నిర్వహకు సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బీసీ నేతలు మాట్లాడుతూ జయహో బీసీ సభను విజయవంతం చేయాలని కోరారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే జగన్ ప్రభుత్వం చూసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జయహో బీసీ కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్న నేపథ్యంలో బీసీల నుంచి తెలుగుదేశం పార్టీకి అనూహ్య స్పందన లభిస్తుందని చెప్పారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, మైనార్టీలని మాట్లాడే జగన్మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల పాలనలో చేసిందని ఏమీ లేదన్నారు. అక్రమ కేసులు, దాడులు, హత్యలతో సరిపెట్టారన్నారు. బీసీల పట్ల జగన్మోహన్‌రెడ్డి కపట ప్రేమ చూపిస్తున్నారని, దీన్ని బీసీ సోదరులు గ్రహించాలన్నారు. జగన్ అంతం బీసీల పంతం అనే నినాదంతో వచ్చే ఎన్నికల్లో బీసీలు సత్తాచాలన్నారు.

కార్యక్రమంలో భాగంగా జయహో బీసీ సదస్సుకు పర్చూరు నియోజకవర్గ స్థాయిలో కోర్డినేషన్ కమిటీని నియమించారు.

కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి గుంజి వెంకట్రావ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడూరి శేషబ్రహ్మచారి, రాష్ట్ర శాలివాహన సాధికార సంఘం సభ్యులు ఇందుర్తి ఏడుకొండలు, గౌడ సాధికారత కమిటీ కార్యదర్శి కాటూరి ప్రసాద్, అగ్నికుల క్షత్రియ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి గొల్లపోతు వెంకటేశ్వర్లు, బాపట్ల పార్లమెంట్ రజక సాధికార కమిటీ సభ్యులు పోలూరి సింగయ్య, తుమ్మలపెంట రామవయ్య, సాగర సాధికార కమిటీ గండికోట వీరయ్య, వడ్డెర సాధికార కమిటీ సభ్యులు పల్లపు అంకమ్మరావు, నాయిబ్రాహ్మణ సాధికారిత సభ్యులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, యాదవ సాధికార కమిటీ సభ్యులు నక్కల రాఘవ, బీసీసెల్ పార్లమెంట్ కమిటీ కార్యదర్శి అన్నవరపు శ్రీనివాసరావు, పర్చూరు నియోజకర్గ బీసీసెల్ నాయకులు శివరాత్రి శ్రీనివాసరావు, కూరపాటి జగన్, ఉప్పు గురవయ్య, గుంటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు టీడీపీ

» నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య



మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, మార్చి 21: అభ్యర్థిగా అధికారికంగా ప్రకటిస్తారు.. అప్పటివరకు ఆగుదామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. అందరం సంయమనం పాటిద్దాం.. అందరం కలసి సిద్ధాంతపరంగా పని చేద్దామని చెప్పారు. క్రమశిక్షణకు మారుపేరుగా అడుగులు వేద్దామని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గురువారం మధ్యాహ్నం నుంచి టీడీపీ మూడవ జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని, అందులో టీడీపీ చీరాల నియోజకవర్గ అభ్యర్థిగా ఎంఎం కొండయ్య పేరు ఉంటుందని పార్టీ శ్రే ణుల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో కూడా వైరల్ అయ్యింది. ఆక్రమంలో స్థానిక పార్టీ కార్యాలయానికి ఒక్కొక్కరుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరారు. వాట్సాప్ గ్రూపులలో కొండయ్యకు అభి నందనలు తెలుపుతూ పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు పోస్టులు పెట్టారు. ఈనేపథ్యంలో సాయంత్రం 7 గంటల సమయంలో కొండయ్య పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ శ్రేణులు కొండయ్యకు అభినందనలు తెలిపేందుకు పోటీపడ్డారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటిస్తారు.. అప్పటివరకు సంయమనం పాటించాలని కోరారు. చీరాల పట్టణం, చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో నియోజవకర్గ పరిధిలో ఎప్పుడు ఎక్కడ ఏ విధమైన అడుగులు వేయాలి.. ఎలా ముందుకు సాగుదామనే విషయంలో సమిష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు



కవాతు నిర్వహిస్తున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర రెడ్డి, ఏఎస్ఐ బాషా తదితరులు

మార్టూరు, మార్చి 21: రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మార్టూరు సెంటర్లో కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. దేగరమూడి సర్వీసు రోడ్డు నుంచి జడ్పీ హైస్కూల్ మీదగా గన్నవరం సెంటరు, పెద్ద అందరు ఖానా గుండా నాగరాజుపల్లి సెంటరు వరకు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిరంతరం పోలీసుల నిఘా గ్రామాలలో ఉంటుందన్నారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని చెప్పారు. గొడవలకు పాల్పడినా, ఘర్షణ వాతావరణాన్ని ప్రోత్సహించినా కేసులను నమోదు చేస్తామన్నారు. ఎన్నికలు పూర్తయ్యేంతవరకు గ్రామాలలో పోలీసుల నిఘా కొనసాగుతుందన్నారు. అనంతరం నాగరాజుపల్లి గ్రామంలో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో 35 మంది కేంద్ర బలగాలు, ఏఎస్ఐ లు భాషా, సైదాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

గ్రానైట్ ముడిరాయి లారీ పట్టివేత

బల్లికురవ, మార్చి 21: పర్మిట్ లేకుండా అక్రమమార్గంలో తరలివెళుతున్న గ్రానైట్ ముడిరాయి లారీని గురువారం విజిలెన్స్ మైనింగ్ ఏడీ ఈరేష్‌బాబు అదుపులోకి తీసుకొన్నారు. వీర్లకొండ క్వారీల నుంచి మార్టూరు వైపు వెళుతున్న గ్రానైట్ ముడిరాయి లారీని నిలుపుదలచేసి తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకపోవటంతో మైనింగ్ అధికారులు బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

నేడు యద్దనపూడిలో మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతి

యద్దనపూడి(మార్టూరు), మార్చి 21: మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు 27వ వర్ధంతిని శుక్రవారం యద్దనపూడి గ్రామంలో నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌తో పాటు పలువురు నాయకులు, గొట్టిపాటి అభిమానులు హాజరుకానున్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ల తొలగింపు

అద్దంకి/బల్లికురవ, మార్చి 21: వైసీపీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్లను గురువారం అధికారులు తొలగించారు. అద్దంకి మండలంలోని గోపాలపురంలో మంగళవారం రాత్రి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి పాల్గొన్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్ నారాయణ, బల్లికురవ మండలంలోని వి.కొప్పెరపాడులో వైసీపీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్న బుర్రి దానారావులను విధుల నుంచి తొలగిస్తూ అధికారులు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

గుంటుపల్లి మహిళకు అమెరికాలో సత్కారం



మాదాల వీరమ్మను సత్కరిస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం సభ్యులు

బల్లికురవ, మార్చి 21: మండలంలోని గుంటుపల్లికి చెందిన పోలేరమ్మతల్లి దేవాలయ ధర్మకర్త అయిన మాదాల వీరమ్మను అమెరికాలో జరుగుతున్న నాట్స్ తెలుగు సంఘం వేడుకల్లో ఘనంగా సత్కరించారు. ఉత్తర అమెరికా నాట్స్ తెలుగు సంఘం ఆధ్వర్యంలో డల్లాస్‌లో అక్కడ స్థిరపడినవారు తెలుగు వేడుకలను నిర్వహిస్తున్నారు. గుంటుపల్లికి చెందిన మాదాల వీరమ్మ కుమారుడు రాజేంద్ర అక్కడ స్థిరపడ్డారు. గ్రామంలో ఉన్న పోలేరమ్మ దేవాలయాన్ని అభివృద్ధి పరచటంతోపాటు ప్రతి ఆదివారం ఎన్నోఏళ్ల నుంచి అన్నదాన కార్యక్రమాన్ని ఆకలి బాధలు తీరుస్తున్నారు. ఈక్రమంలో తెలుగు సంఘం ఆమెను గుర్తించి అమెరికాకు ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మెమెంటోను అందించి మున్ముందు చేపట్టే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపినట్లు వీరమ్మ తెలిపారు. కార్యక్రమంలో నాట్స్ ప్రెసిడెంట్ నూతి బాపయ్య చౌదరి, తెలుగు వేడుకల కన్వీనర్ మాదాల రాజేంద్ర, సభ్యులు స్వప్న, కావ్య, మాధవి పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గలవారిని ప్రోత్సహించాలి

అద్దంకిటౌన్, మార్చి 21: బధిరులలో లోపాలను మరచిపోయేల వారిని ప్రోత్సహించాలని ఎంఈవో2 బూదాటి సుధాకరరావు అన్నారు. వారి అభివృద్ధికి అందరూ కృషి చేయాలని చెప్పారు. గురువారం అద్దంకిలోని సత్రం బడి ఆవరణలో ఉన్న భవిత విద్యావసరుల కేంద్రంలో అంతర్జాతీయ డౌన్‌సిండ్రోమ్ దినోత్సవాన్ని హెచ్ఎం ఇట్లా రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బూదాటి సుధాకరరావు ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు బహుమతులు అందజేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనా, సీఆర్పీ రామకృష్ణ, ఆయా లక్ష్మి పాల్గొన్నారు.

సాహితీ స్రవంతి అధ్యక్షుడు నారాయణరావుకు ఉగాది పురస్కారం

అద్దంకిటౌన్, మార్చి 21: గుంటూరులోని అమరావతి సాహితీ మిత్రులు సంస్థ ఉగాది వేడుకల సందర్భంగా తొమ్మిది మందిని పురస్కారాలకు ఎంపిక చేశారు. వీరిలో అద్దంకికి చెందిన ప్రముఖ కవి, సాహితీ స్రవంతి అధ్యక్షుడు చందలూరి నారాయణరావు ఉన్నారు. ఏప్రిల్ 7న గుంటూరులో జరిగి ఉగాది వేడుకల్లో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. నారాయణరావు ధర్మవరం జడ్పీహెచ్‌ఎస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు.

28న అద్దంకిలో వైద్య శిబిరం

అద్దంకిటౌన్, మార్చి 21: సహిత విద్య సమగ్ర శిక్ష, బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 28న అద్దంకిలోని గురుకాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో 18 సంవత్సరాలలోపు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉచిత సహాయ ఉపకరణాల కోసం వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంఈవో-1 డి. గంగాధరరావు, ఎంఈవో-2 బూదాటి సుధకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి నియోజవర్గంలోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, పంగులూరు, కొరిశపాడు మండలాలలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు వైద్యుల పరీక్షల అనంతరం ఉచితంగా యంత్రాలు, ఉపకరణాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. వైద్య శిబిరానికి వచ్చేవారు సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9849960723, 9490386762 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కోలలపూడిలో ఎస్‌బీఐ సేవా కేంద్రం ప్రారంభం

మార్టూరు, మార్చి 21: మండలంలోని కోలలపూడి గ్రామంలో గురువారం వలపర్ల ఎస్‌బీఐ పరిధిలో వినియోగదారుల సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. వలపర్ల బ్రాంచి మేనేజరు డి.నరేష్ కుమార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కేంద్రం ద్వారా వినియోగదారులు రోజుకు రూ.30 వేలు వినియోగించే అవకాశం ఉందన్నారు. కొత్త ఖాతాదారులు బ్యాంకు ఖాతాను ఈ కేంద్రం నుంచి పొందవచ్చునని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలోని వినియోగదారులకు సౌలభ్యంగా ఉండేందుకు సేవా కేంద్రాన్ని ప్రారంభించామన్నారు.

బాధితుడిని ఆదుకోవాలి

చీరాలటౌన్, మార్చి 21: ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన అలసిన యోధులను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని పలువురు నాయకులు పేర్కొన్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు తన్నీరు నరసింహం (పుట్టిగుడ్డివాడు) వద్ద కొంతమంది నగదు తీసుకుని ఇవ్వకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డిని కలిసి వినతిప్రతం అందజేశారు.

ఈక్రమంలో ఆయనకు మద్దతు తెలిపిన స్థానిక ఏఐటీయూసీ నా యకుడు బత్తుల శామ్యేల్, సీపీఐ నాయకుడు మేడా వెంకటరావు మాట్లాడు తూ మార్టూరు మండలం కొణెదన గ్రామానికి చెందిన బాధితుడు ఎన్నో ప్రజా పోరాటాల్లో ముందుండి పోరాడినట్లు తెలిపారు. నేడు వయోప్రాయంలో ఉండగా గ్రామానికి చెందిన వ్యక్తి రూ.2లక్షలు తీసుకున్నట్లు తెలిపారు. తిరిగి అడుగుతుంటే భయాందోళనకు గురిచేస్తున్నట్లు వివరించారు. ఆర్డీవోను కలిసిన వారిలో అట్లూరి శ్రీను, శీలం వెంకటేశ్వర్లు, రామేశ్వరం కుమార్ ఉన్నారు.

దాతల సహకారం మరువలేనిది

చినగంజాం, మార్చి 21: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాతలు అందిస్తున్న సహకారం మరువ లేనిదని వైద్యాధికారి డాక్టర్ పి.సాయిశ్రీచరణ్ అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాలకు చెందిన ఎన్ఆర్ఐలు శిఖరం రామాంజనేయులు, అనిల్‌కుమార్‌లు పీహెచ్‌సీకి డ్రెసింగ్ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. వీరు సమకూర్చిన డ్రెసింగ్ మెటీరియల్‌ను వారి తండ్రి శిఖరం సూరిబాబు వైద్యాధికారికి అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, వైద్య సిబ్బంది ఎన్.మురళి, మహేష్, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలో విజేతలకు బహుతులు అందజేత

చినగంజాం, మార్చి 21: మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇనిషియేటివ్ అండర్ ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా(టీవోఎఫ్ఐ), ఎన్‌జీవో ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులు 30 మందికి చిత్రలేఖనం పోటీలు నిరహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.దేవదత్తం అధ్యక్షతన జరిగిన సభలో ఎన్‌జీవో రాష్ట్ర అసోసియేట్ మెంబరు బి.ప్రతాప్‌నాయక్ విద్యార్థులకు అడవులను ఎందుకు కాపాడాలి, అడవుల వల్ల ఉపయోగాలు, మొక్కలు నాటవలసిన ఆవశ్యకత గురించి వివరించారు. చిత్రలేఖనం పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఆవరణలో ఎన్‌జీవో సభ్యులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ వి.ఉద యభాస్కర్, పాఠశాల ఇన్‌చార్జ్ డి.నారాయణ రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, ఎల్.శివప్రసాద్, డి.ఆశాలత, సంస్థ సభ్యులు అనుసాగర్, నాగరాజు, జస్వంత్, ఎస్.శ్రీరమణ, కె.నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రదర్ అనిల్‌కుమార్‌ను కలిసిన రంగారావు

చీరాల, మార్చి 21: గత ఎన్నికల్లో చీరాల అసెంబ్లీ నియోజవకర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన దేవరపల్లి రంగారావు ఈపర్యాయం కూడా పోటీలో ఉండేందుకు పావులు కదుపుతున్నారు. అందులోభాగంగా చీరాల నియోజకవర్గ పరిధిలోని పలువురు పాస్టర్లతో గురువారం హైదరాబాద్‌లో బ్రదర్ అనిల్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారి మధ్య నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రంపై చర్చ జరిగినట్లు సమాచారం.